
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377



స్వర్ణం.. సలక్షణం

- గ్రాము ధర రూ.9,878
- సామాన్యుల్లో ఆవేదన
- వ్యాపారుల్లో ఆందోళన
- నేడు అక్షయ తృతీయ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మార్కెట్లో పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. సామాన్యులు కొనలేని స్థాయికి బంగారు ధరలు చేరిపోయాయి. ధనిక, పేద అనే తేడా లేకుండా పెళ్లిళ్లు, శుభకార్యాలు అంటే ముందుగా గుర్తుకువచ్చేది బంగారమే. ముఖ్యంగా వివాహాది శుభకార్యాలకు బంగారు కొనుగోలు తప్పనిసరి. ధనవంతులు కాస్త ఎక్కువగా, మధ్య తరగతి ప్రజలు వారి స్తోమతకు తగ్గట్టుగా బంగారు నగలను కొనుగోలు చేస్తుంటారు. కానీ ఇటీవల కాలంలో పసిడి ధరలు అందనంత ఎత్తుకు చేరాయి. ఎప్పటికప్పుడు పసిడి ధరలు ఆల్‌టైం రికార్డులను నమోదు చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఇన్వెస్టర్లు బంగారంపై ఉంచుతున్నారు. దీంతో పాటు అమెరికా, చైనా దేశాల మధ్య జరుగుతున్న ఆర్థిక యుద్ధం నేపథ్యంలో మన దేశంలో బంగారు ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో భారతీయులకు బుధవారం అక్షయ తృతీయ రోజున బంగారును కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏడాది బంగారు గ్రాము ధర రూ.9,878గా ఉంది. ధర ఇలాగే ఉంటే అక్షయ తృతీయ సందర్భంగా కొనుగోళ్లు తగ్గుతాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. కర్నూలు నగరంలో సుమారు 400కు పైగా బంగారు దుకాణాలు ఉన్నాయి. అక్షయ తృతీయ ఒక్కరోజే బంగారు దుకాణాల్లో రూ.కోట్లలో వ్యాపారం జరుగుతుంది. బుధవారం అక్షయతృతీయ రోజున ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు బంగారు దుకాణాలు కళకళలాడుతాయి.

916 బంగారం కొనాలంటే

ప్రజలు ఆభరణాల్లో 916 హాల్‌మార్క్ బంగారాన్నే అధికంగా కొంటారు. మంగళవారం కర్నూలులో ఓ గ్రాము 22 క్యారెట్(916) బంగారం ధర రూ.8,913 ఉంది. దీనికి 3శాతం జీఎస్టీ, ఆభరణాన్ని బట్టి మేకింగ్ చార్జీలు కలిపితే మరో



రూ.640 అదనం. మొత్తంగా ఓ గ్రాము బంగారు ఆభరణం కొనాలంటే రూ.9,700 వరకు చెల్లించాల్సిందే. ఓ తులం బంగారం కొనాలంటే దాదాపుగా రూ.లక్ష ఖర్చు పెట్టాల్సి వస్తోంది. 24 క్యారెట్ బంగారం ధర ఎప్పుడో లక్ష దాటేసింది. మంగళవారం నంద్యాలలో 24 క్యారెట్ బంగారం ధర రూ.9,900గా ఉంది. దీనికి జీఎస్టీ, మేకింగ్ చార్జీలు అదనం.



ధరల పెరుగుదలకు కారణమిదే..!

అమెరికా, చైనా దేశాల మధ్య వాణిజ్య పోరుతో పాటు డాలర్ బలహీనపడడం వంటి కారణాలతో మదుపరులు బంగారం వైపు మొగ్గుచూపుతున్నారు. ఇదే కాకుండా ప్రభుత్వం కూడా గోల్డ్ నిల్వలు పెంచుకుంటూ ఉంది. యూఎస్ ఎకానమీ పడిపోవడం, డాలర్ మీద నమ్మకం సన్నగిల్లడంతో బంగారంపై పెట్టుబడులు పెట్టడం ప్రత్యామ్నాయంగా మారింది. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం 3,319 డాలర్లకు చేరువలో ఉంది.


దాన ధర్మాలతోనే కీర్తి, యశస్సు



అక్షయ తృతీయ అత్యంత పవిత్రమైన వేడుక. ఈ రోజున ఏది దానం చేసి దాని ఫలం వంశ వంశాల వరకు అందుతుంది. విద్యాదానం, పుస్తక దానం చేస్తే వారికి వంశంలో అవిద్య అనేది లేకుండా సకల విద్యావంతులుగా ఉంటారు. అలా ధనం, ధాన్యం, వస్త్రం, బంగారం, గోవు, భూమి ఇలా ఏదైనా దానం చేయవచ్చు. ప్రతి ఒక్కరూ తమకు కలిగినంతలో కొంత దానం చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని శాస్త్రాలు చెబుతున్నాయి. అలాగే లక్ష్మీదేవికి, విష్ణుమూర్తికి, శివపరమాత్మున్ని పూజించాలని కూడా పురాణాలు చెబుతున్నాయి. అంతేకానీ, ప్రతి ఒక్కరూ అప్పులు చేసి బంగారం కొనమని ఏ శాస్త్రంలోనూ లేదు. దాన, ధర్మాలతోనే మన కీర్తి, యశస్సు, వంశాభివృద్ధి జరుగుతాయి. ఈ వేడుక రోజున దానధర్మాలు ఆచరించి భగవత్ అనుగ్రహం పొందాలి.

- దేవళ్ల వసంత సాయినాథ శర్మ, జ్యోతిష్య పండితుడు, కర్నూలు

శ్రీశైలం జలాశయాన్ని సందర్శించిన ఎన్‌డీఎస్‌ఏ బృందం



డ్యాంను పరిశీలిస్తున్న ఎన్‌డీఎస్‌ఏ బృందం

శ్రీశైలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయాన్ని మంగళవారం జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ బృందం పరిశీలించింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్‌జైన్ నేతృత్వంలో డ్రిప్ ప్రాజెక్టు ప్రతినిధి నీతూ, సీడబ్ల్యూసీ డిప్యూటీ డైరక్టర్ ప్రభాత్‌కుమార్, సీడబ్ల్యూసీ చీఫ్ ఇంజనీర్ రాకేశ్‌కశ్యప్, ఎన్‌డీఎస్‌ఏ రీజనల్ డైరక్టర్ గిరిధర్, ఈఎంసీ రత్నకుమార్‌లు స్థానిక జలాశయ ఇంజనీర్లతో కలసి శ్రీశైలం ఆనకట్ట భద్రతపై మూడు గంటల పాటు సమీక్ష నిర్వహించారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శ్రీశైలం ఆనకట్ట స్థితి గతులను వివరించారు. 2009 వరదల వల్ల శ్రీశైలం ఆనకట్ట కుడి, ఎడమ వైపు కొండచరియలు కొట్టుకుని పోవడంతో పాటు ప్లంజ్‌పూల్ పెరిగిన విషయాన్ని ఆనకట్ట ఇంజనీర్లు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందానికి వివరించారు. సాయంత్రం ఎన్‌డీఎస్‌ఏ బృందం ఆనకట్ట అప్రోచ్‌రోడ్, ప్లంజ్‌పూల్ ప్రాంతంతో పాటు, గ్యాలరీలోకి వెళ్లి బకెట్‌పోర్షన్, వాటరింగ్ సిస్టంను పరిశీలించారు. శ్రీశైలం ఆనకట్ట భద్రత, చేపట్టాల్సిన మరమ్మతులను ఎన్‌డీఎస్‌ఏ బృందం కేంద్ర జలవనరులశాఖ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఇంజనీర్లు తెలిపారు. ఈ పర్యటనలో శ్రీశైలం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ కబీర్ బాషా, ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

మిరప రైతు కుదేలు 6

క్యాజువాలిటీలో తక్షణమే వైద్యమందించండి
- జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు 7

సమస్యల పరిష్కారం కోసమే పోరాటం

- ఎంఎల్‌హెచ్‌పీలను క్రమబద్ధీకరించాలి
- కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు చందన
- శ్రీకృష్ణదేవరాయ కూడలిలో నిరసన

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసమే పోరాటాలు కొనసాగిస్తున్నట్లు ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు చందన అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేస్తున్న మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం శ్రీకృష్ణదేవరాయల కూడలిలో ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏపీఎంసీఏ దశలవారీగా నిరసనలు చేపట్టిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఎన్‌హెచ్‌ఎం కింద రెండేళ్లుగా పనిచేస్తున్నా జీతాల విషయంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఆరేళ్లు దాటిన ఎంఎల్‌హెచ్‌పీలను రెగ్యులర్ చేయాలని, గతేడాది జీవో నెంబరు 64 కింద ఎన్‌హెచ్‌ఎంలో 189 క్యాడర్లకు 23 శాతం పీఆర్‌సీ అమలుచేశారని, కానీ సీహెచ్‌ఓలకు మాత్రమే పీఆర్‌సీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలో 800 మందికిపైగా ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలు ఉన్నారన్నారు. ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతియేడు ఐదు శాతం ఇంక్రిమెంట్ అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నాగరాజు, కోశాధికారి కార్తీక్, జిల్లా నలుమూలల నుంచి సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వోలు



మండే ఎండలో వర్ష సూచన

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో భగభగలాడే ఎండల్లో కూడా మంగళవారం సాయంకాలం కాగానే వర్ష సూచనతో చల్లబడింది. రానున్న మూడు రోజుల్లో కూడా కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీలతో ఎండలు మంచిపోయినా సాయంత్రం 4ఎంఎం నుంచి 40 ఎంఎం వరకు వర్షం పడే అవకాశముందని వాతావరణ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడిస్తోంది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 10నుంచి 16 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని, గాలిలో తేమశాతం ఉదయం 50నుంచి 54శాతం, మధ్యాహ్నం 17 నుంచి శాతం నమోదయ్యే అవకాశముందని వెల్లడించింది. 1,2,3,4వ తేదీల్లో సాయంత్రం ఉరుములు, మెరుపులు బలమైన గాలులు వీచే అవకాశముందని తెలిపింది.

- కర్నూలు జిల్లాలో మంగళవారం మంత్రాలయంలో 40.90. కోడుమూరులో 40.79, కోసిగి 40.40, ఎమ్మిగనూరు 40.23, కౌతాళం 39.50, కల్లూరు 39.50, ఓర్వకల్లు 39.40, దేవనకొండ 39.29, వెల్దుర్తి 39.23, హొళగుంద 39.00 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.
- నంద్యాల జిల్లాలో కోవెలకుంట్ల 40.95, మహానంది 40.93, రుద్రవరం 40.67, కొత్తపల్లె 40.48, బండిఆత్మకూరు 40.42, పాణ్యం 40.29, గడివేముల 40.27, బనగానపల్లె 40.24, శిరువెళ్ల 40.22, జూపాడుబంగ్లా 40.04 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ కార్పొరేషన్ కార్యకలాపాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో నీటి సమస్య తలెత్తకుండా చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో కర్నూలు నగరపాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్, ఎంహెచ్‌ఓ విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్, ఏఈలు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ రంజిత్ బాషా



పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసే అధికారులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పింఛన్ల పంపిణీపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ పంపిణీ అధికారులు అవినీతికి పాల్పడినట్లు రుజువైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు పాలీసెట్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశాల కోసం బుధవారం ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా కోర్డినేటర్ రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని, కర్నూలు టౌన్‌లో 12 పరీక్షా కేంద్రాల్లో 4,584 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆదోని పట్టణంలో పది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 2,768 మంది పరీక్షలకు హాజరవుతారని వివరించారు. ఈ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతోందని, పక్బడందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.



వేసవి సెలవులతో మూతబడిన ఆలూరు మెయిన్ స్కూల్

డీఎస్సీ అభ్యర్థులకు ఇక్కట్లు..

- స్టడీ సర్టిఫికెట్ల కోసం పాట్లు
- పాఠశాలల చుట్టూ ప్రదక్షిణలు
- స్కూళ్లకు వేసవి సెలవులు
- అందుబాటులో లేని హెచ్‌ఎంలు

ఆలూరు, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంటకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు స్టడీ సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోడానికి మిగతా ధ్రువీకరణ పత్రాలతోపాటు 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లను కూడా అప్‌లోడ్ చేయాలి. అయితే ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో గతంలో తాము చదివిన పాఠశాలల నుంచి స్టడీ సర్టిఫికెట్లు తీసుకోడానికి పాఠశాలల్లో హెచ్‌ఎం, టీచర్లు అందుబాటులో లేరు. వారి కోసం తిరగడంతో డీఎస్సీ పరీక్షకు చదువుకోవాల్సిన విలువైన సమయాన్ని కోల్పోతున్నామని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. డీఎస్సీకి దరఖాస్తుల స్వీకరణ వచ్చే నెల 15న ముగియనుంది. అప్పటి దాకా వేసవి సెలవులు ఉన్నందు వల్ల స్టడీ సర్టిఫికెట్ల కోసం స్కూల్ హెచ్‌ఎంలను, ఉపాధ్యాయులను ఫోన్‌లలో సంప్రదిస్తూ ఉండటం తప్ప గత్యంతరం లేని పరిస్థితి ఏర్పడింది.

ఉన్నతాధికారులే పరిష్కారం చూపాలి


సుమారు 35 సంవత్సరాల క్రితం ప్రాథమిక పాఠశాలల్లో చదివిన 4వ తరగతి మొదలుకుని ఉన్నత పాఠశలల్లో 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు అభ్యర్థుల స్థానికతను నిర్ధారిస్తాయి. ఈ ధ్రువపత్రాల ప్రకారమే అభ్యర్థుల లోకల్, నాన్ లోకల్ స్టేటస్‌ను ఉద్యోగాల ఎంపికలో నిర్ణయిస్తారు. ఈ నేపథ్యంలో దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం నుంచి తాము చదువుకున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ఆయా తరగతులకు స్టడీ సర్టిఫికెట్లను పొందడం అభ్యర్థులకు ఇబ్బందిగా మారింది. మెగా డీఎస్సీకి ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధికంగా 2,645 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో వేలాది మంది అభ్యర్థులు పోటీ పడతారన్న అంచనాలున్న నేపథ్యంలో దరఖాస్తుకు అవసరమైన స్టడీ సర్టిఫికెట్ల కోసం ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రభుత్వం పరిష్కారం చూపాల్సి ఉంది.

అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



ఇది కీలకమైన సమస్యే. డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ సర్టిఫికెట్లను జారీ చేసేందుకు ఎదురవుతున్న సమస్యలు మా దృష్టికి వస్తున్నాయి. స్టడీ సర్టిఫికెట్ల కోసం అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలకు సూచనలు ఇస్తాం. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు 8121821266, 9182152840 సంప్రదించాలి. అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- శామ్యూల్ పాల్, డీఈవో, కర్నూలు



STUDY CERTIFICATES

This is to certify that ...

Son/Daughter of Sri ...

has studied in this School / College from ... Class to ... class during the period from 1984-85 to 1990-91

Station: ... Signature: ...

Date: ... Designation: ...

స్టడీ సర్టిఫికెట్

పారిశ్రామిక కారిడార్లలో రైల్వేలైన్ల అభివృద్ధి కీలకం

- ఓర్వకల్లు కారిడార్‌కు 53 కిలోమీటర్ల పనులు చేపట్టాలి
- కృష్ణపట్నం పారిశ్రామిక నోడ్ వరకు 12 కి.మీ.
- ఇవి అభివృద్ధి చెందితే 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కి మంత్రి టీజీ భరత్ వినతి



కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక కారిడార్లలో రైల్వే లైన్ల అభివృద్ధి ఎంతో కీలకమని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి ఓ వినతి పత్రం ద్వారా రాష్ట్రంలో రైల్వే లైన్ల అభివృద్ధికి సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధి వేగంగా జరిగేందుకు పూర్తిగా సహకరించాలని, ఓర్వకల్ నోడ్, చెన్నయ్ - బెంగళూర్ ఇండస్ట్రియల్ కారిడార్ కింద కృష్ణపట్నం నోడ్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ నోడ్‌లకు రైల్వే కనెక్టివిటీల కోసం అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కేంద్ర మంత్రికి వివరించానని తెలిపారు. ఓర్వకల్లు నోడ్ కింద దూపాడు రైల్వేస్టేషన్ నుంచి ఓర్వకల్లు మీదుగా బేతంచెర్ల వరకు కొత్త రైల్వేలైన్ అభివృద్ధి, ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌వరకు రైల్వేసైడింగ్ 53 కిలోమీటర్ల అభివృద్ధి చేయాలని కోరారు. దీంతో పాటు కృష్ణపట్నం రైల్వేస్టేషన్ నుంచి ఓబులవారిపల్లె- కృష్ణపట్నం సెక్షన్ నుంచి కృష్ణపట్నం పారిశ్రామిక నోడ్ వరకు రైల్వే సైడింగ్ 12 కిమీ అభివృద్ధి చేయాలని కోరారు. ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లను ఆధునిక మౌలిక సదుపాయాలతో పాటు ఇంటిగ్రేటెడ్ మల్టీ మోడల్ లాజి స్టిక్స్ పార్కులతో స్థిరమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇవి అభివృద్ధి చెందితే 4లక్షలకు పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయని చెప్పారు. విదేశీ పెట్టుబడులతో సహా సుమారు రూ.55వేల కోట్లు వస్తాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్- బెంగళూర్ ఇండస్ట్రియల్ కారిడార్ కింద ఓర్వకల్, వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కింద కొప్పర్తి నోడ్‌ను ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆమోదించినట్లు తెలిపారు. 73 నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ సమావేశంతో పాటు డీపీఐఐటీ సమావేశాల్లో రాష్ట్రంలో అవసరమైన పారిశ్రామిక నోడల్‌కు రైలు కనెక్టివిటీని అందించాలని సూచించింది. ఓర్వకల్లు, కృష్ణపట్నం నోడ్‌లకు ప్రతిపాదిత రైల్వేసైడింగ్ లైన్ల అభివృద్ధిని చేపట్టడానికి ప్రభుత్వ ప్రతిపాదనలను రైల్వే శాఖ వీలైనంత త్వరగా ఆమోదించేలా చూడాలని కోరారు. ఈ నోడ్‌లకు రైల్వే కనెక్టివిటిని మెరుగు పరచడం వల్ల లాజిస్టిక్స్ పార్కులు, కార్గో టెర్మినల్స్, ఓడరేవులకు వస్తువులను తరలించేందుకు వీలు ఉంటుందని తెలిపారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.61 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న శివసేవకులు

శ్రీశైలం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈనెల ఒకటో తేదీ నుంచి 28వ తేదీ వరకు సమకూరిన ఆదాయాన్ని లెక్కించగా రూ.3,61,42,016 రాబడిగా వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు వెల్లడించారు. నగదుతో పాటు 10.54 తులాల బంగారు, 4.860 కిలోల వెండి వచ్చినట్లు తెలిపారు. అలాగే వివిధ దేశాల కరెన్సీ హుండీ లెక్కింపులో లభించినట్లు తెలిపారు. హుండీ ఆదాయం లెక్కింపులో డిప్యూటీ ఈఓ రమణమ్మ, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.



హైక్లాసులకు ఎస్జీటీలా?

సంస్కరణలన్నీ మంచివని భ్రమపడాల్సిన పని లేదు. ఆ పేరుతో గతం కంటే అధ్వానమైన పరిస్థితి తేవచ్చు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యావిధానంలో భాగంగా వచ్చే ఏడాది నుంచి తేనున్న మార్పులు ఉదాహరణ. ప్రాథమికోన్నత పాఠశాలలు హైస్కూళ్లలో విలీనం అవుతాయి. దీని వల్ల ఆరో తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్ల బదులు సెకెండ్ గ్రేడ్ టీచర్లు చదువు చెప్పే పరిస్థితి వస్తుంది. ఈ విధానం వల్ల విద్యార్థులు పూర్తిగా నష్టపోయే ప్రమాదముందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

- విద్యావిధానంలో వింత పోకడలు
- అగమ్యగోచరంగా 6 నుంచి 8వ తరగతి విద్యార్థుల చదువు
- ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతున్న ఉపాధ్యాయ సంఘాలు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సహజంగా 6వ తరగతి నుంచి విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లు బోధించాలి. కాని వచ్చే ఏడాది నుంచి అమలు కానున్న నూతన సంస్కరణల్లో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలలు హైస్కూళ్లలో విలీనం అవుతాయి. నంద్యాల జిల్లాలో 96 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా అందులో 50 పాఠశాలలను హైస్కూళ్లగా మార్చారు. 18 పాఠశాలల్లో విద్యార్థులు తగినంత సంఖ్య ఉండడంతో ఎలాంటి మార్పు చేయకుండా వాటిని అక్కడే హైస్కూల్‌గా ఉన్నతీకరించారు. మిగిలిన 28 ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా, మోడల్ పాఠశాలలుగా చేశారు. 28 పాఠశాలల్లో 6,7,8 తరగతి చదివే విద్యార్థులు 60లోపు ఉన్నట్లు విద్యాశాఖాధికారులు గుర్తించారు 60 మంది లోపు విద్యార్థులను కూడా సమీపంలోని హైస్కూల్స్‌లో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు అధికారుల ద్వారా తెలియజేశారు. కాని హైస్కూల్స్ ఐదు కిలోమీటర్ల కంటే దూరం ఎక్కువగా ఉండడంతో పాటు పలు పాఠశాలల్లో స్థానిక సమస్యలను చూపుతూ స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను దూరంగా ఉన్న పాఠశాలల్లో చేర్చేది లేదని, అక్కడే ఉంటారని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఆయా పాఠశాలలను అక్కడే కొనసాగించారు. 10 మంది విద్యార్థులున్న చోట ఇద్దరు ఎస్జీటీలు, 11నుంచి 30 మంది విద్యార్థులు ఉన్నచోట ముగ్గురు ఎస్జీటీలు, 31 నుంచి 40 మంది దాటితే ఐదుగురు ఎస్జీటీలను కేటాయించడం పట్ల కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 6 నుంచి 8వరకు చదువుతున్న విద్యార్థులకు ఎస్జీటీలను కేటాయించడమేమిటని, విద్యాప్రమాణాలు దెబ్బతింటాయని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

విద్యార్థులు తక్కువగా ఉన్న చోట ఎస్ఏలను ఇవ్వలేము



విద్యార్థులు తక్కువగా ఉన్న చోట ఎస్ఏలను ఇవ్వలేము. పలు ప్రాథమిక పాఠశాలలకు హైస్కూళ్లు దూరంగా ఉన్నాయి. ఆ విద్యార్థులకు ట్రావెల్స్ అలవెన్స్ కూడా ఇస్తామని చెప్పాం. అనేక ప్రాథమికోన్నత పాఠశాలల్లో 10 మంది కూడా విద్యార్థులు లేరు. 60 మంది విద్యార్థులకన్నా ఎక్కువగా ఉన్న పాఠశాలలను హైస్కూల్‌గా మార్చాం.

\- జనార్దన్‌రెడ్డి, డీఈవో, నంద్యాల

స్కూల్ అసిస్టెంట్లతోనే బోధించాలి



ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు తప్పనిసరిగా స్కూల్ అసిస్టెంట్లతోనే బోధించాలి. అప్పర్ ప్రైమరీ పాఠశాలలను తొలగించడంలో భాగంగా ఏర్పడిన గందరగోళం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. హైస్కూల్స్ దూరంగా ఉండడం కూడా ఒక కారణంగా చెబుతున్నప్పటికీ ఎలాంటి పరిస్థితుల్లో 6,7,8 తరగతి విద్యార్థులకు ఎస్జీటీలతో బోధించడం మంచిది కాదు.

\- రామఫక్కీరారెడ్డి, పీఆర్‌టీయూ యూనియన్

ఎస్జీటీలకు ప్రమోషన్‌లు కల్పించాలి



ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు తప్పనిసరిగా సబ్జెక్టు టీచర్లే బోధించాలి. లేదంటే ఎస్జీటీలకు శిక్షణనిచ్చి ఎస్ఏలుగా ప్రమోషన్‌లు కల్పించి వారితో చదువు చెప్పించాలి. అందరికీ సమన్యాయమైన విద్యను అందించాలి.

\- శివయ్య, ఐక్య ఉపాధ్యాయ సంఘం నాయకులు

శాస్త్రీయంగా లేదు



ఒకే తరగతి విద్యార్థులకు ఒకరికి ఎస్ఏలతో, మరొకరికి ఎస్జీటీలతో బోధించడం శాస్త్రీయంగా లేదు. ప్రభుత్వం పునరాలోచించాలి. 70 మంది కంటే విద్యార్థులు తక్కువగా ఉన్న చోట ప్రధానోపాధ్యాయులు, పీఈటీ ఉండరని చెప్పడం వల్ల పర్యవేక్షణాలోపం ఏర్పడుతుంది.

\- ప్రసాద్, యూటీఎఫ్ నాయకుడు

విలీన ఆలోచన విరమించుకోవాలి



ఉన్నత పాఠశాలలో ప్రాథమిక తరగతులను విలీనం చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలి. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్జీటీలతో చదువు చెప్పించడం సమంజసం కాదు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. సంస్కరణలను పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతనే నిర్ణయాలు తీసుకోవాలి.

\- శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ నాయకుడు



మిరప రైతు కుదేలు

దిగుబడి తగ్గి, ధరలు లేక కన్నీటి కష్టాలు



కుప్పలుగా పోసిన మిరప పంట



రేవనూరులో మిరప పంటను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కోటి ఆశలతో మిరపను సాగు చేసిన రైతులకు కన్నీటి కష్టాలు తప్పడంలేదు. గత రెండు సంవత్సరాల నుంచి ఇదే పరిస్థితి. రూ. లక్షలు పెట్టుబడులు పెట్టి పంటను సాగు చేస్తే ఓ వైపు దిగుబడులు రాక మరో వైపు మార్కెట్లో ధరలు లేక మిరప రైతులు కుదేలవుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలకు కనీసం పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, కోవెలకుంట్ల మండలాలున్నాయి. ఈ మండలాల్లో మిరప సాగు విస్తీర్ణం 4.746 హెక్టార్లు కాగా సుమారు 3.910 హెక్టార్లలో పంట సాగు అయింది. చాలా మంది రైతులు మిరపను సాగు చేయాలంటే బోర్ల కింద నీటి వసతి ఉన్న భూముల్లోనే ఈ పంట సాగు చేయాలి కాబట్టి నీటి వసతి ఉన్న భూములు దాదాపు 50వేల నుంచి రూ.70వేల వరకు కౌలుకు భూములు తీసుకుని ఎరువులు, విత్తనాలు, నీరు సేద్యం ఇలా అన్నీ కలుపుకుని ఎకరాకు సుమారు రూ.2లక్షల నుంచి రూ.2.50లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. పంటకు కోత పనులు కూడా జరిగాయి. ప్రస్తుతం పంట కల్లాల్లో కుప్పలుగా ఆరబోశారు. ఎకరాకు 25 నుంచి 30క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి కేవలం 10 నుంచి 12 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటం ధర రూ.10వేల నుంచి రూ.12వేలు పలుకుతోంది. రెండేళ్ల కిందట క్వింటం రూ.23వేల నుంచి రూ.26వేలు వరకు ఉండగా, గత ఏడాది రూ.14వేల నుంచి 17వేల వరకు తగ్గింది. ప్రస్తుతం ఈ ఏడాది ధరలు బాగా తగ్గడంతో కనీసం పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడులు, ఉన్న ధరలతో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పలువురు రైతులు అంటున్నారు.

మండలాల వారీగా మిరప పంట సాగు ఇలా...

మండలం	సాధారణసాగు (హెక్టార్లలో)	సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)
కోవెలకుంట్ల	993	936
దొర్నిపాడు	388	163
ఉయ్యాలవాడ	427	417
సంజామల	1506	1263
అవుకు	1015	802
కొలిమిగుండ్ల	417	329

తెగుళ్లతో దిగుబడి సరిగా రాలేదు



ఐదెకరాల్లో మిరప పంట సాగు చేశా. ఎకరాకు 2 నుంచి రూ.2.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. తెగుళ్ల సోకి పంట దిగుబడి సరిగా రాలేదు. వచ్చిన పంటకు కూడా గిట్టుబాటు ధర రాకపోవడంతోపెట్టిన పెట్టుబడులు కూడా రాక దాదాపు ఐదు లక్షల వరకు అప్పులు అయ్యాయి. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

\- గార్లపాటి రమణారెడ్డి

మార్కెట్‌లో ధర లేదు



ఆరు ఎకరాల్లో కౌలుకు తీసుకుని ఎకరాకు 40వేలు చొప్పున కౌలు తీసుకుని మిరప పంట సాగు చేశాను. పెట్టుబడికి మాత్రం ఎకరాకు రూ.3లక్షల వరకు వచ్చింది. పంట మాత్రం అంతంత మాత్రమే రావడంతో వచ్చిన పంట ధర లేకపోవడంతో ఎకరాకు లక్షన్నర వంతున రూ.9 లక్షలు నష్టం వాటిల్లింది.

\- జి. రామమద్దిలేటి

సాగునీటి పన్ను వసూలుకు చర్యలు: కలెక్టర్



నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఏళ్లతరబడి పేరుకుపోయిన సాగునీటి పన్ను బకాయి వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సాగునీటి పన్ను వసూళ్లు, ఆయకట్టు స్థిరీకరణపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టుల ద్వారా అందుతున్న సాగునీరుకు సంబంధించి మాన్యువల్ ప్రకారం దాదాపు రూ.20 కోట్ల డిమాండ్ మేర సాగునీటి పన్ను వసూలు చేయాల్సి ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న పన్ను వసూళ్లను త్వరలోనే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, కర్నూలు, నంద్యాల జిల్లాల నీటిపారుదల శాఖ ఎస్ఈలు శేఖర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

29 యూనిట్లకు రూ.4.50 కోట్ల రాయితీలు

జిల్లాలో 29 యూనిట్లకు రూ.4.50 కోట్ల మేర రాయితీలు మంజూరైనట్లు కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా పారిశ్రామిక కమిటీ సమావేశాలు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. పీఎం విశ్వకర్మ పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు

మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించి వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు అందించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో 2025-26 ఆర్థిక సంవత్సర మహిళల వ్యవస్థాపకత కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నోవిధాలుగా చేయూతనిస్తోందని అన్నారు.

నిప్పు.. ముప్పు



నంద్యాల జిల్లా అగ్నిమాపక కార్యాలయం

వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలతో ముప్పు పొంచి ఉంది. రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. ప్రజల్లో అవగాహన లోపం ఒక ఎత్తైతే కనిపించని నిర్లక్ష్యం లావాలా వ్యాపిస్తోంది. ఇల్లు, పరసరాలు భద్రమేనా అని ఎవరికి వారు ప్రశ్నించుకుని దైనందిన జీవితంలో జాగ్రత్తగా ఉంటే అగ్ని ప్రమాదాలకు అవకాశముండదని అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు. గడిచిన రెండేళ్లలో నంద్యాలల్లో 428 అగ్నిప్రమాదాలు జరిగాయి. అనధికారికంగా చిన్నాచితకా మరో వంద వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. వేసవి నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- వేసవిలో తస్మాత్ జాగ్రత్త
- ముదురుతున్న ఎండలు
- అగ్నిప్రమాదాలకు ఆస్కారం
- ప్రజల్లో అవగాహన లోపం
- పలు మండలాలకు ఒక్కటే ఫైరింజన్
- గత రెండేళ్లలో 428 ప్రమాదాలు
- అగ్నిప్రమాదాల నివారణకు అధికారుల సూచనలు

నంద్యాల టౌన్ ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లాలో నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, నందికొట్కూర్, ఆత్మకూరు, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో అగ్నిమాపక శాఖ కేంద్రాలు ఉన్నాయి. చాలా మండలాలకు సుమారుగా 30 కి.మీ దూరం వరకు ఒకటే ఫైరింజన్ ఉండడంతో బాధితులు ఫోన్ చేసి వారు వచ్చే సరికే జరగాల్సిన కాస్త నష్టం జరుగుతుంది. నంద్యాల నుంచి బండిఆత్మకూరు, శిరివెళ్ల, గడివేముల, గోస్పాడు పాణ్యం, మహానంది వంటి మండలాలకు ఒకటే ఫైరింజిన్ ఉంది. జిల్లా కేంద్రంలో కూడా ఒకటే ఫైర్ ఇంజిన్ ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆళ్లగడ్డ నుంచి కోవెలకుంట్ల, బనగానపల్లె నుంచి అవుకు, కొలిమిగుండ్ల, సంజామల వంటి మండలాలకు కూడా ప్రమాదం జరిగినప్పుడు వెళ్లాలంటే సమయం ఎక్కువగా పట్టడంతో అగ్నికి అహుతి అవుతున్నాయి.

ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కొత్త గ్యాస్ సిలిండర్‌ను తెచ్చిన వెంటనే లీకేజీలు ఉన్నాయా, అనేది నిర్ధారించుకొని వాడాలి. లీకేజీ ఉన్న సిలిండర్ వస్తే వెంటనే గ్యాస్ ఏజెన్సీలకు సమాచారమివ్వాలి. నాణ్యమైన ట్యూబ్‌ను ఉపయోగించుకోవాలి.
- వంట చేసే సమయంలో కిటికీలు, తలుపులు తెరిచి ఉంచాలి.
- పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాముల చుట్టూ అగ్ని నిరోధక పరికరాలు తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలి. చిన్న అగ్గిరాజుకున్న నివారణ చర్యలు చేపట్టే విధంగా జాగ్రత్తలు ఉండాలి.
- గ్రామాల్లో ఎక్కడ దూమపానం చేసిన బీడీ, సిగరెట్ ముక్కలను ఎక్కడ పడితే అక్కడ పడివేయకుండా పూర్తిగా ఆర్పివేయాలి.



అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అర్పుతున్న ఫైర్ సిబ్బంది. (ఫైల్)

అవగాహన అవసరం



అగ్నిప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకోక ముందే అక్కడ ఉన్నవారే సహాయక చర్యలు చేపట్టాలంటే అవగాహన అవసరం. దీంతో ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ఉంటుంది. అందుకే అవగాహన కార్యక్రమాలు చేస్తున్నాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.

\-యోగేశ్వరరెడ్డి, అసిస్టెంట్ డీఎఫ్‌వో, నంద్యాల

క్యాజువాలిటీలో తక్షణమే వైద్యమందించండి

- అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేని వార్డులపై ఆరా
- జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): క్యాజువాలిటీలో రోగులకు తక్షణం వైద్యం అందించి అడ్మిషన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ధన్వంతరి హాలులో వివిధ విభాగాల హెచ్‌వోడీలతో సమీక్షించారు. ఆస్పత్రి సేవలపై ఫీడ్‌బ్యాక్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్, ఓపీ, వార్డుల్లో పనులపై రోగులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు చేస్తామని, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేని వార్డులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డాక్టర్ చిట్టి నరసమ్మ, శ్రీరాములు, కే.సీతారామయ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రాయలసీమ సాధనే లక్ష్యం

- కుంచం వెంకటసుబ్బారెడ్డి



కమిషనర్‌తో కుంచం వెంకటసుబ్బారెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాయలసీమ రాష్ట్రమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబును కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జూలై 7న అనంతపురంలో సమితి ప్లీనరీ సమావేశాలు, బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2018 ఎన్నికల ముందు ప్రధాని నరేంద్ర మోదీ రాయలసీమకు ఇచ్చిన డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. రాయలసీమ ప్రజల మనోభావాలను దెబ్బతీయవద్దని, అమరావతికి నరేంద్ర మోదీని ఆహ్వానించడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3లో అన్ని రకాలైన అధికారాలను కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. యుద్ధప్రాతిపదికన కొత్త రాష్ట్రాన్ని కూడా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంతవరకు తెలంగాణ మాదిరిగా రాయలసీమ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని చేపడుతున్నామని, పరిస్థితి చేయి దాటిపోతే కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరించారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- భయాందోళన చెందిన ప్రయాణికులు



కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

పెద్దకడుబూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఓ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి డ్రైనేజీ కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన కంబళదిన్నె గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ఎమ్మిగనూరు నుంచి కోసిగికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు మండలంలోని కంబళదిన్నె గ్రామంలో మంగళవారం డ్రైనేజీ కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు భయపడి కేకలు వేశారు. ప్రయాణికులకు ఏమి కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం కాలువలో నుంచి బస్సును గ్రామస్థులు బయటకు లాగారు. ఎమ్మిగనూరు- కోసిగి ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా ఉండటంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



ఉద్యోగిని పరామర్శిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న పెస్ట్‌కంట్రోల్ ఏజెన్సీకి చెందిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మహేష్ ఎలుకలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మూడు రోజులుగా సెలవులో ఉన్న అతడు సోమవారం రాత్రి పెస్ట్ కంట్రోల్ ఆఫీస్ బీరువాలోని ఎలుకల మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బంధువులు క్యాజువాలిటీకి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు ఉద్యోగిని పరామర్శించారు. ఓ ఉద్యోగి వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు అధికారులకు వివరించినట్లు తెలిసింది. తనకు 6 నెలల చిన్నారి ఉన్నట్లు అత్యవసరమైతే అనుమతి ఇవ్వటం లేదని తెలిసింది. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలకు ఆదేశించారు.

రోగులకు వైద్యసేవలు అందిస్తాం

- కలపరి గ్రామంలో పర్యటించిన రాష్ట్ర మలేరియా అధికారి



డ్రమ్మును పరిశీలిస్తున్న మలేరియా అధికారి రామనాథ్‌రావు

ఆస్పరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విషజ్వరాల బారిన పడిన రోగులకు వైద్య సేవలు అందిస్తామని, ఆందోళన చెందవద్దని రాష్ట్ర మలేరియా అధికారి రామనాథ్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కలపరి గ్రామంలో పర్యటించారు. 15 రోజులుగా విషజ్వరాలు ప్రబలినట్లు వార్తలు రావడంతో ఆయన రాష్ట్ర మలేరియా డిప్యూటీ డైరక్టర్ రామనాథ్‌రావు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో భాస్కర్, జిల్లా మలేరియా అధికారి నూకరాజుతో కలిసి గ్రామంలో పరిస్థితిని పరిశీలించారు. గ్రామంలో 53 మంది నుంచి రక్త నమునాలు సేకరించి, 26 మంది రోగులను వైద్య పరీక్షల కోసం కర్నూలుకు పంపగా పది మందికి చికున్ గున్యా సోకినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. అనంతరం గ్రామానికి తాగునీరు సరఫరాచేసే ఓవర్‌హెడ్ ట్యాంకును తనిఖీ చేశారు. చేశారు. ఏడాది నుంచి ట్యాంకును శుభ్రపరచలేదని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చికున్‌గున్యా ప్రాణాంతకం కాదని, తగిన జాగ్రత్తలు పాటిస్తే తగ్గించుకోవచ్చన్నారు. జ్వర పీడితుల ఇళ్లకు వెళ్లి తాగునీటి ట్యాంకులను పరిశీలించామన్నారు. గ్రామంలో ఏఎన్ఎం లేరని అధికారుల దృష్టికి తీసుకురాగా, వెంటనే నియమించాలని రాష్ట్ర మలేరియా అధికారి ఆదేశించారు. అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్, మలేరియా సబ్ డివిజన్ అధికారి రఘురాంరెడ్డి, బాలకృష్ణారెడ్డి, సర్పంచు భర్త పెద్దరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్, వీఆర్వో గోవింద్ ఉన్నారు.

గుండెకు చికిత్స ఏదీ..?

- కార్డియాలజీ డిపార్ట్‌మెంట్‌లేని జీజీహెచ్.. ఊసే లేని కార్డియాలజిస్టులు
- హృద్రోగులకు తప్పని తిప్పలు
- అత్యవసరమైతే ప్రైవేటుకు వెళ్లాల్సిందే..
- ఆస్పత్రి స్థాయి పెరిగినా.. నిర్లక్ష్యం



నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి

నంద్యాల జిల్లాగా అవతరించినా.. నేటికీ జిల్లా వాసులకు వైద్య సేవలు అంతంత మాత్రమే. ప్రభుత్వాస్పత్రిని ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్)గా స్థాయిని పెంచారు. అయినా నిర్లక్ష్యపు నీడలో జీజీహెచ్ కొట్టుమిట్టాడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సిందే. కనీసం కార్డియాలజీ డిపార్ట్‌మెంటు లేదు. కార్డియాలజిస్టు ఊసే లేదు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో తాత్కాలిక వైద్యంచేసి కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు. జిల్లాలో హృద్రోగ బాధితులు అధికంగా ఉన్నట్లు ఇటీవలే సర్వేలో వెల్లడైంది. ఈ ఆసుపత్రిలో కార్డియాలజీ డిపార్ట్‌మెంట్ ఏర్పాటుకు అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది.



ఆసుపత్రిలోని ఐసీయూ వార్డు

నంద్యాల హస్పిటల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పేరుకే ప్రభుత్వ సర్వజన వైద్యశాల. అక్కడ వైద్యసేవలు మాత్రం అంతంత మాత్రమే. ముఖ్యంగా గుండె చికిత్సకు సంబంధించి ఎలాంటి వైద్యం ఇక్కడ అందదు. అత్యవసరమైతే ప్రాణాలు అనంత వాయువుల్లో కలవాల్సిందే. గుండె సంబంధిత వ్యాధుల రోగులు జీజీహెచ్‌కు వెళ్లాలంటే భయపడుతున్నారు. జీజీహెచ్‌లో కార్డియాలజీ డిపార్ట్‌మెంట్ లేకపోవడమేకాక గుండె వైద్య నిపుణులు ఒక్కరూ కూడా లేరు. దీంతో గుండె సంబంధిత రోగులను ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకొని ఎమర్జెన్సీ వార్డులో తాత్కాలిక చికిత్సలు నిర్వహించి కర్నూలుకు పంపుతున్నారు. కొందరు వ్యాధి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అత్యవసర నిమిత్తం ప్రైవేట్ హాస్పిటల్స్‌ను ఆశ్రయిస్తున్నారు.

జీజీహెచ్‌కు గుండెకు సంబంధించిన రోగులు వెళ్లినా వారికి ఎమర్జెన్సీగా ఇంజెక్షన్ టెనెక్టిక్ ప్లేస్‌ను ఇంజెక్షన్ వేసి కార్డియాలజిస్ట్ సూచనల మేరకు రోగులకు చికిత్స నిర్వహిస్తున్నారు. ఈ ఇంజెక్షన్ విలువ దాదాపు రూ.40వేల వరకు ఉంటుంది. ఇది రోగులకు నంద్యాల జీజీహెచ్‌లో ఉచితంగానే అందిస్తున్నారు. నంద్యాల జిల్లా కేంద్రమైన తర్వాత జిల్లా ఆస్పత్రిని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)గా మార్చారు. అయితే జిల్లా కేంద్రంలో కార్డియాలజీ డిపార్ట్‌మెంట్ లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఆస్పత్రికి నంద్యాల పరిసర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో చికిత్స కోసం వస్తుంటారు. ఇటీవల రాష్ట్ర సర్వేలో నంద్యాల జిల్లాలో గుండె వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నట్లు తేలింది. ఇంత ప్రాధాన్యత ఉన్న కార్డియాలజీ విభాగం ఏర్పాటుచేయడంలో అధికారులు విఫలమయ్యారని చెప్పవచ్చు. ఆస్పత్రి స్థాయిని పెంచారేగాని వైద్యులను నియమించడంలో మరిచిపోయారని పలువురు విమర్శిస్తున్నారు.

ఈనెల 25వ తేదీన యాల్లూరు గ్రామానికి చెందిన వెంకటేష్ నంద్యాల జీజీహెచ్‌కు చికిత్స కోసం వచ్చాడు. ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తున్న వెంకటేష్‌కు గుండె సంబంధిత సమస్య ఉన్నట్లు వైద్యులు తేల్చారు. ఎమర్జెన్సీగా రాత్రికి రాత్రే వెంకటేష్‌ను కర్నూలుకు తీసుకుపోయారు. పేద కుటుంబానికి చెందిన వెంకటేష్ ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్లలేక కర్నూలు జీజీహెచ్‌కు వెళ్లాడు. ప్రతిరోజు నంద్యాల జీజీహెచ్‌కు 10నుంచి 15మంది గుండె సంబంధిత రోగులు వస్తుంటారు. ఆస్పత్రి స్థాయి పెరగడంతో రోగులు హుటాహుటిన గుండె సంబంధిత వ్యాధులకు చికిత్స ఉంటుందని ఆస్పత్రికి వస్తున్నారు. తీరా ఆస్పత్రికి వచ్చిన తర్వాత గుండెవైద్య నిపుణులు లేరని తెలియడంతో ఎక్కడికివెళ్లాలో తెలియక గందరగోళానికి గురవుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ విభాగం నంద్యాల జీజీహెచ్‌లో ఏర్పాటు చేయాలని సర్వత్రా కోరుతున్నారు.

కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం



నంద్యాల జీజీహెచ్‌లో కార్డియాలజీ డిపార్ట్‌మెంట్ లేదు. గుండె వైద్యనిపుణులు కూడా అందుబాటులో లేరు. కార్డియాలజీ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ రాజకుమారి గనియా దృష్టికి తీసుకుపోయాం. ప్రతిపాదనలు కూడా పంపించాం. ఆస్పత్రికి వస్తున్న హృద్రోగులకు ఎమర్జెన్సీ చికిత్స అందించి కర్నూలు జీజీహెచ్‌కు రెఫర్ చేస్తున్నాం.

- డా.మల్లేశ్వరి, సూపరింటెండెంట్, నంద్యాల

దొంగల ముఠాకు మూడేళ్ల జైలు

- రెండు నెలల్లో శిక్ష పడేలా చేసిన తాలుకా పోలీసులు
- అభినందించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్



శిక్ష పడిన హరియాణా గ్యాంగ్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు

కర్నూలు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 24.. అర్ధరాత్రి 1.45 గంటల సమయం. గుర్తుతెలియని వ్యక్తులు జాతీయ రహదారి పక్కనే ఏటీఎం మిషన్‌ను దొంగలించి తీసుకెళ్తుండగా స్థానికులకు అనుమానం వచ్చింది. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీస్ వాహనం సైరన్ వినగానే దొంగల ముఠా ఏటీఎం యంత్రాన్ని వదిలేసి చీకట్లో పారిపోయారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆధారాలతో అంతర్రాష్ట్ర హరియాణా రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేయడమే కాకుండా పక్కా ఆధారాలతో కేసును న్యాయస్థానంలో రుజువుచేసి శిక్ష పడేలా చేసిన కర్నూలు తాలుకా సర్కిల్, ఉల్లిందకొండ పోలీస్‌స్టేషన్ పోలీసులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు. శభాష్ పోలీస్ అనిపించారు. ఎస్పీ ఇచ్చిన సమాచారం మేరకు.. కర్నూలు నగర శివార్లలోని కల్లూరు మండలం ఉల్లిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్నటేకూరు వద్ద కర్నూలు జాతీయ రహదారి-44 సర్వీస్ రోడ్డు పక్కనే బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం కేంద్రం ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 24న అర్ధరాత్రి 1:45 గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు ఏటీఎం యంత్రాన్ని పెకలించి తాళ్లతో కట్టి హైవేపైకి లాక్కెళ్లుతున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకోబోతుండగా.. వారి వాహనం సైరన్ శబ్దం విన్న దొంగల ముఠా ఏటీఎంను వదిలేసి చీకట్లో పరారయ్యారు. పోలీసులు వెతికినా ఫలితం లేదు. ఉల్లిందకొండ పోలీస్ స్టేషన్‌లో దోపిడీ కేసు నమోదు చేశారు. అది అంతర్రాష్ట్ర ముఠా పనేనని గుర్తించిన ఎస్పీ విక్రాంత్‌పాటిల్, కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, కర్నూలు తాలూకా సీఐ చంద్రబాబునాయుడు, ఉలిందకొండ ఎస్సై ధనుంజయ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంను ఏర్పాటుచేశారు. ఏటీఎం మిషన్‌ను దొంగలించడానికి టోయింగ్ వాహనాన్ని దొంగలించినట్లు గుర్తించారు. సీసీ ఫుటేజీలను సేకరించారు. నేషనల్ హైవే పొడవునా టోల్‌ప్లాజా వద్ద ఉన్న సీసీ కెమెరాలను క్షుణంగా పరిశీలించారు. హరియాణాకు చెందిన ఓ ముఠా.. కంటైనర్ డ్రైవర్‌గా హరియాణా నుంచి బెంగళూరుకు కంటైనర్‌లో కార్లు తీసుకొచ్చారు. అక్కడి నుంచి అదే కంటైనర్‌లో మారుతి సుజికీ కార్లను 23వ తేదీ కర్నూలుకు తీసుకొచ్చి అన్‌లోడ్ చేశారు. అదేరోజు తిరిగి వెళ్లకుండా నేషనల్ హైవే పక్కన ఉన్న ఏటీఎంలపై నిఘా పెట్టారు. రెక్కీ నిర్వహించాక.. 24న అర్ధరాత్రి 11.30 గంటలకు ఏటీఎం మిషన్‌ను పెకలించే పనులు మొదలు పట్టారు. 1.45 గంటలకు ఎట్టకేలకు పెకలించి.. తాళ్లుకట్టి హైవే వైపు తీసుకెళ్తుండగా స్థానికులు గుర్తించడం, వారి సమాచారం అందుకున్న పోలీసులు రావడంతో పారిపోయారు. 5-10 నిమిషాలు ఆలస్యమై ఉంటే కంటేనర్‌లో ఏటీఎంను ఎక్కించుకొని పారిపోయే అవకాశం ఉండేది. సీసీ ఫుటేజీలు ఆధారంగా పది రోజుల్లో కేసులు ఛేదించారు. హరియాణాకు చెందిన సూన్నీషాహీద్‌ఖాన్, సున్నీ ఇమ్రాన్‌ఖాన్, మహమ్మద్ జంసాద్‌ఖాన్, మహమ్మద్ షావ్కర్‌ఖాన్‌లే ఈఘటనకు పాల్పడ్డారని పక్కా ఆధారాలు సేకరించారు. మార్చి 6న అరెస్టుచేసి కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించారు. అంతటితో ఆగకుండా సాంకేతిక ఆధారాలు సేకరించి దర్యాప్తు నివేదికను కోర్టులో ఉంచారు. స్పెషల్ మొబైల్ కోర్టు, ఎఫ్ఏసీ స్పెషల్ జేఎఫ్‌సీఎం (పీఅండ్‌ఈ) కోర్టు విచారణ నేరం రుజువు కావడంతో జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయాధికారి సరోజనమ్మ మూడేళ్ల జైలుశిక్ష, రూ.14 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసును ఛేదించడమే కాకుండా శిక్షపడేలా చేసిన కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, కర్నూలు తాలూకా సర్కిల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఉలిందకొండ ఎస్సై ధనుంజయ, కోర్టు కానిస్టేబుళ్లు మహేశ్, శేఖర్ సహా నిందితులకు శిక్ష పడేలా బలమైన వాదనలు వినిపించిన ఏపీపీ అనిల్‌కుమార్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కోసిగి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామన్‌దొడ్డి గ్రామ పొలిమేర్లలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు కోసిగి సీఐ మంజునాథ్ తెలిపారు. వివరాలు.. పింజరి బషీర్ వరి పొలంలో మృతదేహాన్ని మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు అలసనూరు గ్రామానికి చెందిన చిన్నమూతి కొండయ్య, ఈరమ్మ దంపతుల కుమారుడు చిన్నమూతి నాగరాజు(38)గా గుర్తించారు. అతడు గ్రామాల్లో చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతూ జులాయిగా తిరిగేవాడని, కోసిగి పోలీస్‌స్టేషన్‌లో మూడు దొంగతనం కేసులు నమోదైనట్లు ఎస్ఐ హనుమంతురెడ్డి తెలిపారు. మృతుడి తల్లి చిన్నమూతి ఈరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వాల ధ్యేయం

- అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలి
- కేంద్ర బృందం ప్రతినిధులు
- ఉత్తమ పంచాయతీలో పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

మద్దికెర, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని కేంద్ర బృందం ప్రతినిధులు షాప్రదీప్ టోపో, శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని పెరవలి గ్రామాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేయడంతో మంగళవారం కేంద్ర బృందం ఇక్కడ పర్యటించింది. గ్రామంలోని పరిసరాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రజలకు ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదో అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. పెరవలి ఉత్తమ పంచాయతీగా ఎంపికైందని ప్రజలందరూ గ్రామ అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువవుతున్నాయో లేదో అడిగి తెలుసుకోవాలన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి మంచినీరు అందించాలని, నీటిఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. పంచాయతీకి గ్రామపెద్దలు, ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రతిఒక్కరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలు ఖచ్చితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయ అధికారి నాగేంద్ర, డీపీవో భాస్కర్, డీఎల్‌పీవో వీరభద్రప్ప, సర్పంచ్ మల్లిఖార్జున, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తంచౌదరి, విరాళదాత విశ్వనాథ్, హుసేన్‌సాహెబ్, ఎంపీడీవో కొండయ్య, డిప్యూటీ ఎంపీడీవో మద్దిలేటిస్వామి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నాం..

- డోన్‌లో ముస్లింల ప్రదర్శన



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

డోన్‌టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడులను ఖండిస్తున్నామని ముస్లిం ఐక్యవేదిక నాయకుడు సుభాన్ అన్నారు. మంగళవారం రాత్రి ముస్లింల ఆధ్వర్యంలో ఈద్గా మసీదు నుంచి శాంతియుతంగా కొవ్వొత్తుల ర్యాలీ పాతబస్టాండ్ వరకు చేపట్టారు. హిందూ ముస్లింలు భాయిభాయి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము ఉగ్రవాదులకు వ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్య వేదిక నాయకులు మౌలాలి, చాంద్, రవూఫ్, మసీదుల మతపెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి



టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలతో డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి

ఓర్వకల్లు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కాల్వ, హుస్సేనాపురం, ఓర్వకల్లు గ్రామాల్లో జరుగుతున్న టైలరింగ్ శిక్షణను ఆయన తనిఖీ చేశారు. కాల్వ గ్రామంలో మగ్గం తయారు చేస్తున్న మహిళలతో మాట్లాడారు. హుసేనాపురం గ్రామంలో కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి కార్యాలయంలో ప్రభుత్వ అధ్వర్యంలో జరుగుతున్న టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పొదుపు మహిళలు అన్ని విధాలుగా చైతన్యవంతులు అయ్యారన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట పొదుపులక్ష్మి మండల గౌరవ సలహాదారురాలు విజయభారతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, సమాఖ్య అధ్యక్షురాలు రత్నమ్మ, సెక్రటరీ సుమతి, డీపీఎంలు నరసమ్మ, హజరత్, ఏపీఓ వెంకటరామిరెడ్డి, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



మాట్లాడుతున్న పీఎండీ ఇస్మాయిల్

కర్నూలు రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండో రోజూ సోమవారం కూడా కర్నూలు-1, 2 డిపో ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. శిబిరంలో ఎన్‌ఎంయూఏ రీజనల్ ప్రెసిడెంట్ ఎంఆర్ నాయుడు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పీఎండీ ఇస్మాయిల్ హాజరై మాట్లాడారు. ఆర్టీసీలో ఉద్యోగులకు 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, అన్ని కేటగిరీలలో పదోన్నతులు ఇవ్వాలని, ఈహెచ్‌ఎస్‌కు బదులుగా పాత వైద్య విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌ఎం యూఏ వర్కింగ్ ప్రెసిడెంట్ వీఏ వలి మాట్లాడుతూ 114 జీవో ప్రకారం ఎన్/యూ అలవెన్సు పెంచాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో దేవేంద్ర, రామారావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్ఓ బాషా, ఎస్.నజీరుల్లా, ఎస్ జాకీర్ హుస్సేన్, జీఎస్ వాసులు, ఎం.నర్సింహులు, ఎం. నారాయణ కూర్చొన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ రీజనల్ ఉపాధ్యక్షుడు రంగన్న, రీజనల్ చైర్మన్ గౌస్, కర్నూలు-1, 2 డిపో అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటాల ద్వారా 1886లో సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినాలను బీజేపీ ప్రభుత్వం కుప్పకూల్చిందన్నారు. నేడు దేశంలో మోదీ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్లను అమలు చేయాలని చూస్తుందన్నారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా పాల్గొన్నారు.

సారా విక్రేత్రలపై కేసులు నమోదు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నాటు సారా విక్రేత్రలపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. మంగళవారం కర్నూలు మండలంంలోని దిన్నెదేవరపాడు శివారులో ఎర్రమల, నగరంలోని బంగారుపేటలో నీలి షికారీ మోతి, నీలి షికారి వెంకటేష్ నాటు సారా అమ్మకాలు చేస్తూ బెల్లం కలిగి ఉండటాన్ని గుర్తించి కేసులు నమోదు చేశారు. ఆటోలో తనిఖీలు చేయగా 60 లీటర్ల నాటు సారా సీజ్ చేశారు. ఓర్వకల్లు మండలంలో నాటు సారా తయారు చేస్తున్న కోమరోలుకు చెందిన ఆర్ రవికుమార్, బి.పెద్దమద్దిలేటి, లక్ష్మయ్య, మద్దిలేటి, లొద్దిపల్లెకు చెందిన పి.శివకుమార్, పి.నిర్మల కుమార్, పెద్దపల్లి మద్దిలేటి ఉప్పలపాడుకు చెందిన లక్ష్మీదేవి, కాల్వబుగ్గకు చెందిన రామేశ్వరమ్మ నాగమద్దయ్య, సోమయాజులపల్లెకు చెందిన లక్ష్మయ్యలపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు నవీన్, రెహానా, సిబ్బంది రామలింగయ్య, ఈరన్న, చంద్రపాల్ పాల్గొన్నారు



స్వాధీనం చేసుకున్న సారాతో ఎక్సైజ్ పోలీసులు

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

డీసీహెచ్ఎస్ ఆఫీసర్ శ్రీనివాసులు



రోగితో మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీసీహెచ్ఎస్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఓర్వకల్లులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి అందుతున్న వైద్య సేవల గురించి ఆయన ఆరా తీశారు. అనంతరం స్టాక్ రూమ్, వివిధ గదులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో వైద్యులు తప్పని సరిగ్గా ఉండాలన్నారు. ఎండ తీవ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట వైద్యులు ఉన్నారు.

ఉగ్రవాదంపై ఐక్యంగా ఉద్యమిద్దాం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదంపై ఐక్యంగా ఉద్యమించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రా దాడి పిరికిపంద చర్యగా భావించాలన్నారు. ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మే 3న ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞా కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర సమితి నిర్ణయించిందన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి బీసన్న, అఖిల్, కాశి, మునిస్వామి, కుమార్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి

సి.బెళగల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని కోడుమూరు ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్‌గౌడు అన్నారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, ఇనగండ్ల, సంగాల గ్రామాల్లో అయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మధుసూదన్ గౌడు మాట్లాడుతూ అయిల్ ఫామ్ సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చుని అన్నారు. ఆయిల్ ఫామ్ సాగు చేస్తే ఎస్సీ, బీసీ రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్లు చెంచురాజు, నాగన్న, రాజశేఖర్ నాయక్, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సి.బెళగల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలని వెలుగు ఏపీఎం రమేష్ అన్నారు. మంగళవారం మండల వెలుగు కార్యాలయంలో బుక్ కీపర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బుక్‌కీపర్లు, సీసీలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: ఎంఈవో

గూడూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తప్పవని మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ హెచ్చరించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు వేసవి సెలవుల్లో పాఠశాలలను తెరవరాదన్నారు. పాఠశాలల గురించి ఎలాంటి కాన్వాసింగ్ చేయరాదని, విద్యార్థులను చేర్చుకోన రాదని అన్నారు. డ్రాప్ అవుట్ విద్యార్థులను రీ జాయినింగ్ చేసిన వ్పుడు వారి వివరాలు కరెక్టుగా ఉండేలా చూసుకోవాలన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు

గూడూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులందరికీ ఇంటి స్థలాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రామంజనేయులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందరికీ ఇళ్లు అనే కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వనుందని, అర్హులంతా గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

పోటీ పరీక్షల్లో సమయ పాలన ముఖ్యం

విశ్రాంత డీఈవో పాండురంగస్వామి



మాట్లాడుతున్న పాండురంగస్వామి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షల్లో సమయ పాలన ముఖ్యమని విశ్రాంత డీఈఓ పాండురంగస్వామి అన్నారు. మంగళవారం స్థానిక బిర్లా కాంపౌండులో శ్రీఈశ్వరాస్ ట్యూటోరియల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ శిక్షణ శిబిరం ముగింపు వేడులకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని నిరంతరం శ్రమించాలన్నారు. సంస్థ గౌరవ సలహాదారుడు డి.ఈశ్వరయ్య మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సుతో ప్రభుత్వం, ప్రైవేటు రంగాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం విశ్రాంత డీఈఓని ఎస్టీబీసీ కళాశాల ప్రిన్సిపాల్ సునీతారోజ్, అధ్యాపకులు మురళీకృష్ణ, దస్తగిరి శాలువా కప్పి సన్మానించారు.

వక్ఫ్ సవరణ బిల్లు రద్దయ్యే వరకు పోరాటం

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు రద్దయ్యే వరకు పోరాడాలని జేఏసీ నాయకులు హమీద్, అజీస్‌ఖాన్ పిలుపునిచ్చారు. మంగళవారం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలనే డిమాండ్‌తో చేపట్టిన భారీ ర్యాలీకి హాజరైన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

వేసవి దుక్కులు చేపట్టాలి: ఏవో

సి.బెళగల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఏటవాలుగా దుక్కులు చేపట్టడం వలన కురిసిన వర్షపు నీటి బొట్టు భూమిలో ఇంకుతుందని వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎంపీఈవోలు రైతులకు అందుబాటులో ఉండి వేసవి దుక్కులపై సూచనలు ఇవ్వాలన్నారు. ఈసమావేశంలో ఎంపీఈవోలు వెంకటేశ్వర్లు, ఈశ్వర్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉపకులపతి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఉపకులపతి వి.వెంకట బసరావు అన్నారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో 2న జరగ నున్న సైన్సు, ఆర్ట్స్ కాలేజీ విద్యార్థుల వీడ్కోలు దినోత్సవాన్ని పుర స్కరించుకుని క్రీడ పోటీలను ఉపకులపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బోయ విజయకుమార్, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, డీన్‌లు భరత్‌కుమార్, శివకిషోర్, రవికుమార్, బి.కవిత, మోనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బసవేశ్వరుడి జయంతి సభ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): లింగాయతి మత స్థాపకుడు బసవేశ్వరుడి జయంతి సభ బుధవారం ఉదయం 10గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా శాఖ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంస్కృతిక విప్లవకారుడిగా బసవేశ్వరుడు సమాజానికి అందించిన సేవలపై సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ ప్రధాన వక్తగా విచ్చేసి ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా ఆవుల చక్రపాణి యాదవ్, విశిష్ట అతిథిగా సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, సమన్వయ కర్తగా ఎంపీ బసవరాజు వ్యవహరిస్తారని తెలిపారు.

నేడు జిల్లా గో సంరక్షణశాలలో చందనోత్సవం: నగరంలోని కిడ్స్ వరల్డ్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ జిల్లా గో సంరక్షణశాలలో బుధవా రం వైశాఖ శుద్ధ తదియ అయిన 'అక్షయ తృతీయ' సందర్భంగా శ్రీకష్ణ ఉత్సవమూర్తికి చందనోత్సవం నిర్వహిస్తున్నట్లు గాయత్రి గోసేవా సమితి కార్యదర్శి రాజ్యలక్ష్మి తెలిపారు. దేవదాయ శాఖ, గాయత్రి గోసేవ సమితి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 8 గంటలకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు



వైస్ ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఉపకులపతి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఉపకులపతి వి.వెంకట బసవరావు అన్నారు. మంగళవారం కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ దేవికారాణి పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఉపకులపతి మాట్లాడుతూ దేవికారాణి తన సర్వీసులో ఎక్కడ రాజీ పడింది లేదని, ఇచ్చిన ప్రతి పనిని సమర్థవంతంగా నిర్వహించారని అన్నారు. అనంతరం క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటరమణారెడ్డి, మైకేల్ డేవిడ్, పావని, సునీత, డాక్టర్ నాగరాజు, ఎస్‌ఎం బాషా, రమణయ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో ఉప్పలపాడు



ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం

ఓర్వకల్లు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు గ్రామం ప్రగతి పథంలో ముందుకెళ్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి లేక వీధులన్నీ మురికి కూపాలుగా ఉండేవి. ఎమ్మెల్యే గౌరు చరిత సహకారంతో గ్రామంలో అభివృద్ధి పథంలో ముందుకెళ్తుతుంది. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.12 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు రూ.6లక్షలతో డ్రైనేజీ, మూడు నీటి తొట్లు, మరో మూడు గోకులం షెడ్లు నిర్మాణాలు చేపట్టారు. ఏ వీధికి వెళ్లినా రాత్రివేళలో వీధిలైట్లు వెలుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వీదిలైట్లకు కూడా డబ్బులు లేక సర్పంచులు అప్పులు చేసి వీదిలైట్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం



ఏపీలో రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో సర్పంచులకు నిధులు లేక, అభివృద్ధి చేయలేకపోయాం. రాష్ట్ర ప్రభుత్వంలో సర్పంచులకు నిధులు పుష్కలంగా అందుతున్నాయి. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా సమస్యను పరిష్కరించాం.

\- ఎం.అయ్యస్వామి, సర్పంచ్, ఉప్పలపాడు

శాస్త్రీయ నృత్య కళలను భావితరాలకు అందజేయాలి

రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పుల్లయ్య

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భారతీయ శాస్త్రీయ నృత్య కళలను భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత నృత్య గురువులపై ఉందని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం, టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగిన కూచిపూడి, భరత నాట్యం వర్క్‌షాపు ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆధునిక కాలంలో శాస్త్రీయ కళలు మరుగున పడకుండా అనునిత్యం శిక్షణలతో ముందుకు వస్తున్న నృత్య గురువులందరూ అభినందనీయులని ప్రశంసించారు. హైదరాబాదు స్కూల్ ఆఫ్ డ్యాన్స్ డైరెక్టర్, నృత్య గురువు పద్మ కల్యాణి మాట్లాడుతూ కర్నూలులో వర్క్‌షాపు ఏర్పాటు చేసి శాస్త్రీయ కళారీతుల ఉనికిని చాటిచెప్పడం అభినందనీయమన్నారు. కూచిపూడి నృత్య గురువు ఎస్ కరీముల్లా మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రం, శ్రీనటరాజ నృత్య కళామందిర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాపును విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ పొందిన నృత్య కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా నృత్య గురువులను ఎస్ కరీముల్లా శాలువ, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన నృత్య గురువు పఠాన్ మొహిద్దీన్, విజయవాడ భరత నాట్యం నృత్య గురువు ఎ.సంతోష్, నటరాజ నృత్య కళామందిర్ కార్యవర్గ కమిటీ ప్రతినిధులు డాక్టర్ స్వరూప్ సిన్హా, కేపీఆర్ శర్మ, కె.సునీత పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మండల ప్రత్యేక అధికారి రంగనాథబాబు



మాట్లాడుతున్న రంగనాథబాబు

సి.బెళగల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలకు పంచాయతీ ప్రత్యేక అధికారులు అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేక అధికారి రంగనాథబాబు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఎంపీడీవో రాణెమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథబాబు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు, పరిసరాల శుభ్రత, విద్యుత్ దీపాలు, వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో వ్యవసాయ కూలీలు వడదెబ్బకు గురికాకుండ ఉష్ణోగ్రత పెరిగే లోపు పొలం పనులను పూర్తి చేసుకుని తమ ఇళ్లకు చేరుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో వైద్యులు అందుబాటులో ఉండి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలన్నారు. ఈసమావేశంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో రాణెమ్మ పాల్గొన్నారు.

బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తా

డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్



కేఈ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ ఆయన్ను శాలువతో సత్కరించారు. అనంతరం కేఈ ప్రభాకర్‌ను కుడా వై.నాగేశ్వరరావుయాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ నాపై ఉన్న నమ్మకంతోనే టీడీపీ అధినేత చంద్రబాబు, యువ నేత నారా లోకేశ్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ పదవి ఇచ్చా రన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పోతురాజు రవీకుమార్, ధరూర్ జేమ్స్, సత్రం రామక్రిష్ణుడు, రెడ్డిపోగు బజారన్న, కాసాని మహేష్ గౌడ్, షేక్షావలి పాల్గొన్నారు.

కల్లూరు పశు వైద్యశాలలో సమస్యల తిష్ఠ

● ప్రహరీ లేక ఇక్కట్లు
● మౌలిక వసతులు లేక సిబ్బంది అవస్థలు



కల్లూరు పశువైద్యశాల

కల్లూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కల్లూరు పశువైద్యశాలలో (ఏడీఏ కార్యాలయం) సమస్యలు తిష్ఠ వేశాయి. పశువైద్యశాలలో ప్రహరీ లేదు. వైద్యులు చికిత్స చేసే సమయంలో పశువులు బెదిరిపోయి ప్రహరీ దూకి గాయాల బారిన పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిదెళ్ల క్రితం ఓ కాంట్రాక్టర్ ప్రహరీ నిర్మాణం పేరుతో ఉన్న దానిని తొలగించారు. సకాలంలో పనులు ప్రారంభించకపోవడం అంతలోనే ఎన్నికలు రావడంతో అప్పటి నుంచి ప్రహరీ లేక వైద్యులు, రైతులు అవస్థలు పడుతున్నారు. కనీసం అక్కడ పనిచేసే మహిళా ఉద్యోగులకు మరుగుదొడ్లు లేవు.

● ప్రతినెలా మీటింగ్‌కు తిప్పలే: కల్లూరులోని ఏడీఏ పశువైద్యశాల పరిధిలోకి కల్లూరు, ఓర్వకల్లు, వెల్దుర్తి మూడు మండలాలు వస్తాయి. ప్రతినెలా ఏడీఏ స్థాయి అధికారి ఆధ్వర్యంలో డాక్టర్లు, ప్యారా సిబ్బంది, పశువైద్య సహాయకులతో రెండు సార్లు మీటింగ్ జరగాల్సి ఉంది. కల్లూరు పశువైద్యశాలలో వసతులు లేకపోవడంతో కలెక్టరేట్‌లోని డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలోని అధికారి పర్మిషన్‌తో మీటింగ్ హాల్లో సమావేశాలు జరుపుకుంటున్నారు. కల్లూరు అర్బన్ పరిధిలోని 19, 20, 21, 26, 27, 28, 29, 30, 31, 32, 33, 34, 35, 36, 37, 41 వార్డుల పరిధిలోని రైతులు పశువులకు వైద్యం కోసం ఇక్కడికే వస్తారు. అధికారులు స్పందించి పశువైద్యశాలలో వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.



కూల్చి వేసిన ప్రహరీ

● సిబ్బంది కొరత.. మరుగుదొడ్ల సమస్య

కల్లూరు పశువైద్యశాలలో ఇద్దరు అటెండర్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో మహిళా సిబ్బంది పశువులకు చికిత్స అందించే పరిస్థితులు ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ఏడీఏ క్యాంపులకు వెళ్లిన సందర్భాల్లో ప్యారా సిబ్బంది, పశువైద్య సహాయకులే చికిత్స చేస్తున్నారు. పశువులకు చికిత్స సమయంలో ట్రెవిస్‌షెడ్ లేక ఎండలో పశువులు, రైతులు అవస్థలు పడుతు న్నారు. ప్రహరీ నిర్మాణం పేరుతో కార్యాలయంలో మెట్లు, మరుగుదొడ్లు, ప్రహరీ తొలగించడంతో పైన మొదటి అంతస్తులో ఉండే భవనం పూర్తిగా నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్లూరు పశువైద్యశాలలో సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మించాలి

కల్లూరు పశువైద్యశాలలో ప్రహరీ నిర్మించాలి. వైద్యం కోసం వచ్చే పశువులు ప్రహరీ లేక బెదిరిపోయి పారిపోతున్నాయి. పశువైద్యశాలలో సిబ్బంది కొరత ఉంది. తక్షణమే అటెండర్లను నియమించాలి. మహిళా ఉద్యోగులకు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు.

\- సంపతి లక్ష్మీరెడ్డి, రైతుసంఘం అధ్యక్షుడు

ఐటీఐలో ప్రవేశాలు

ఆలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో 2025-26 మొదటి విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూర్యశేఖర్‌రెడ్డి మంగళవారం కోరారు. ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానిక్ డీజిల్, వెల్డర్, డ్రస్ మేకింగ్, కంప్యూటర్ కోర్సులు ఉన్నాయన్నారు. మే 24వ సాయంత్రం 5 గంటల్లోపు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఐటీఐ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను ఆలూరు ప్రభుత్వ ఐటీఐలో మే 26వ తేదీలోపు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. విద్యార్థులు కర్నూలు బి.తాండ్రపాడులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. వివరాలకు ఆలూరు ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయాల్లో చిన్నారుల ఆటపాట

ఆలూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో చిన్నారులకు సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంను మంగళవారం ప్రారంభించారు. చిన్నారులకు కథలు, ఆట, పాటలు నిర్వహించారు. ఆలూరు గ్రంథాలయాధికారి కె.విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనం, వ్యక్తిత్వ వికాసం, ఆటలు, పాటలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.


సమ్మర్ ఓరియంటేషన్‌లో చిన్నారులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


చిరుత పాద ముద్రలు పరిశీలిస్తున్న అటవీ అధికారులు

క్రిష్ణగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దనలయ్య కొండ పరిసరాల్లో చిరుత సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు కాళిదాసు, రామచంద్రుడు హెచ్చరించారు. మంగళవారం కంబాలపాడు-పెనుమాడ గ్రామాల మధ్యలోని దనలయ్య కొండ ప్రాంతాల్లో చిరుత పాద ముద్రలను పరిశీలించారు. చిరుత మరోసారి సంచరిస్తే బోన్ ఏర్పాటు చేస్తామని, పొలాలకు వెళ్లే రైతులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మే 2 నుంచి సమ్మర్ క్యాంపు


అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న సీడీపీవో శశికళ

• ఆలూరు సీడీపీవో శశికళ

ఆలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మే 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్పెషల్ సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నటు ఆలూరు సీడీపీఓ శశికళ తెలిపారు. మంగళవారం కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని 15 నుంచి 18 సంవత్సరాల కిషోరి బాలికలకు కేలండర్ ఆధారంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులను జయప్రదం చేయాలని కోరారు.

ఆలయ భూముల వేలం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

మద్దికెర, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): చెన్నకేశవస్వామి ఆలయ భూముల వేలాలు మంగళవారం నిర్వహించారు. ఈవో వీరయ్య, పర్యవేక్షణాధికారి నరసయ్య ఆధ్వర్యంలో 43 ఎకరాల భూమిని కౌలుకు వేలం వేయగా సంవత్సరానికి రూ.6.26లక్షల గుత్త వచ్చింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఆదాయం పెరిగింది.

దేవరలో వ్యక్తి మృతి


వెంకటరాముడు(ఫైల్)

మద్దికెర, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రవిరెడ్డి వీధికి చెందిన వెంకటరాముడు(55) దేవరలో పాల్గొంటూ గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల మేరకు.. మృతుడి బంధువులు గ్రామదేవత మద్దమ్మకు దేవరకు మేళతాళాలతో బయలుదేరగా అందరూ ఉండడంతో ఆనందంతో చిందులు వేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. బంధువులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో గ్రామస్థులు దేవరను నిలిపివేసి, నిరాశతో వెనుదిరిగారు.

ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోండి

• తహసీల్దార్ శివరాముడు



ఆదోని రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రభుత్వం నుంచి ఇంటి పట్టా, గృహం పొందనివారు బుధవారం నుంచి ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శివరాముడు సూచించారు. ప్రభుత్వం అందరికీ ఇల్లు కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభిందన్నారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున ప్రభుత్వం స్థలం పంపిణీ చేయనుందని తెలిపారు. సమీప సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బెల్టు దుకాణాలను ఉపేక్షించం

ఆదోని రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బెల్టు దుకాణాలను ఉపేక్షించమని, ఆదోని తాలూకా సీఐ నల్లప్ప హెచ్చరించారు. మంగళవారం మాట్లాడుతూ బెల్టు దుకాణాలు నిర్వహించినా, కర్ణాటక మద్యాన్ని సరఫరా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పల్లెల్లో తాగునీటి తిప్పలు



ఆస్పరి మండలం ఐనేకల్‌లో మినీ ట్యాంకు వద్ద బిందెలు, చిరుమాన్ దొడ్డిలో తాగునీటి కోసం ఎదురుచూస్తున్న చిన్నారులు

• ఆస్పరి, దేవనకొండ మండలాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి

ఆస్పరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు దాహంతో అల్లాడిపోతున్నారు. బోర్లలో భూగర్భజలాలు అడుగంటడంతో ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని చిరుమాన్ దొడ్డి, చిగిలి, నగరూరు, తంగరుడోన, యాటకల్లు, కల్లపరి, ఐనేకల్, కైరుపుల, పుప్పాల దొడ్డి గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ , గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. నాగనాథన హళ్లి రిజర్వాయర్ నుంచి తాగునీరు సక్రమంగా పంపిణీ చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, తాగునీటి పథకాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని కోరుతున్నారు.

పుల్లాపురంలో తాగునీటి ఎద్దడి

దేవనకొండ: మండలంలోని పుల్లాపురంలో తాగునీటి సమస్యతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామం చుట్టూ 15కి పైగా చేతి పంపులు, బోర్లుఉన్నా అవి పనిచేయడం లేదు. గతంలో గ్రామానికి సూమారు 4 కిలో మీటర్ల దూరంలో బోరు వేసి నీరందించారు. వేసవి కావడంతో భూగర్భ జలాలు ఇంకిపోయి అదికుడా సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుడుతున్నామని, పరిష్కరించాలని కోరుతున్నారు.


దేవనకొండ: పల్లాపురంలో నిరుపయోగంగా బోర్లు

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త వహించాలి

మద్దికెర, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వడదెబ్బకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి సూచించారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యపరీక్షలు నిర్వహించారు. బయటకు వెళ్లే వారు తలటోపీ, గొడుగు ఉపయోగించుకోవాలన్నారు. పనికి వెళ్లేవారు తలకు రుమాలు, వాహనంపై వెళ్లేవారు హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వాటర్ బాటిల్ వెంట తీసుకువెళ్లాలన్నారు. నీరసంగా అనిపిస్తే వైద్యసిబ్బంది ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకొని వినియోగించాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తాం : ఎస్ఈ ఉమాపతి


ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ ఉమాపతి

ఆలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తామని విద్యుత్ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. మంగళవారం ఆలూరు విద్యుత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో జిల్లాలో 250 స్తంభాలు పడిపోయాయని, మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. లోవోల్టేజీ సమస్య లేకుండా చూస్తామన్నారు. జిల్లాలో వ్యవసాయ విద్యుత్ బోర్ల కోసం 7,500 దరఖాస్తులు రాగా 4,500 క్లియర్ చేశామన్నారు. వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరిగితే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి


ఆలూరు: మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

• హౌసింగ్ పీడీ చిరంజీవి

ఆలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ చిరంజీవి సూచించారు. మంగళవారం ఆలూరు ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరించి నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన సాయాన్ని వివరించి, ప్రోత్సహించాలన్నారు. ఎంపీడీవో మహబూబ్ బాషా, హౌసింగ్ డీఈ ఆదినారాయణ, ఏఈ గంగమ్మ పాల్గొన్నారు.

మేలోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

దేవనకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గతంలో మంజూరైన పీఎంఏవై గృహ నిర్మాణాలను మే చివరిలోపు పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ చిరంజీవి సూచించారు. మంగళవారం దేవనకొండ హౌసింగ్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. 2022-23లో జిల్లా వ్యాప్తంగా 11,706 పీఎంఏవై గృహాలు మంజూరు కాగా 5,874 మాత్రమే పూర్తయ్యాయని, ఇంకా 5,832 గృహాలు వివిధ దశలలో ఉండగా, మండలంలో 392 మంజూరు కాగా, 132 పూర్తి అయ్యాన్నారు మిగతా గృహాలను మే లోపు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకేనేలా చూడాలని డీఈ ఆదినారాయణ తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు నాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

అధినాయకత్వం నిర్ణయం మేరకే చైర్మన్ ఎంపిక : ఎమ్మెల్సీ


నూతన ఇన్‌చార్జి చైర్మన్ గౌస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ

ఆదోని టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినాయకత్వం సూచన మేరకు వైస్ చైర్మన్ గౌస్‌ను మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ఎంపిక చేశామని ఎమ్మెల్సీ మధుసూదన్, వైసీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ఎంపికైన గౌస్‌ను వైసీపీ నాయకులు మంగళవారం సన్మానించారు. గత చైర్‌పర్సన్ వాల్మీకి శాంతను అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి పదవి నుంచి దింపామని, ఎన్నికల సంఘం చైర్మన్ ఎంపికకు అనుమతి ఇచ్చి ఉంటే వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థినే చైర్‌పర్సన్‌గా ఎంపిక చేసేవారమన్నారు. ఇన్‌చార్జి చైర్మన్ గౌస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇన్‌చార్జిగా ఎంపిక చేయడంతో బాధ్యత పెరిగిందన్నారు. కౌన్సిలర్లు, అధికారుల సహకారంతో అభివృద్ధి పనులను పూర్తి చేస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, ఫయాజ్ అహ్మద్, వై.జి బాలాజీ, ఇబ్రహీమ్, రఘునాథ్ రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


సైకిల్ జాతాను ప్రారంభిస్తున్న డీవైఎఫ్ఐ నాయకుడు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మత్తు పదార్థాలు లేని సమాజాన్ని నిర్మించుకుందామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రామచేంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణ కమిటీ సభ్యులు జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్, వెంకటేష్ ఆధ్వర్యంలో మత్తు, బెట్టింగ్ యాప్‌లకు వ్యతిరేకంగా యువ చైతన్య సైకిల్ యాత్రను జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న జెండా ఊపి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ యువత పాలిట శాపంగా మారిందని, వీటిని ప్రభుత్వం నిషేధించాలని, యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు సతీష్, మోహన్, నవీన్, సూరి, జమీర్, బాబు, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణకు పద్మభూషణ్‌పై హర్షం


మాట్లాడుతున్న నాయకులు

తుగ్గలి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు ఇవ్వడం పట్ల టీడీపీ యువ నాయకుడు మిద్దె వెంకటేశ్ యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటస్వామి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం జొన్నగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 40 ఏళ్లుగా సినీ పరిశ్రమలో పనిచేసి, ఎన్నో విజయాలు సాధించారన్నారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టి ప్రజా, సేవా కార్యక్రమాలు చేసిన బాలకృష్ణకు అవార్డు సంతోషకరమన్నారు.

ఉత్తమ పంచాయతీకి బహుమతులు

మద్దికెర, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తమ పంచా యతీగా ఎంపికచేయడంతో మంత్రి టీజీ భరత్ మంగళవారం కూలర్ క్యాన్, గోడ గడియారాన్ని బహుమతిగా పంపారు. డీఎల్‌పీవో వీరభద్రప్ప, డిప్యూటీ ఎంపీడీవో మద్దిలేటిస్వామి, సర్పంచ్ మల్లిఖార్జున, ఉప సర్పంచ్ గోపాల్, టీడీపీ నాయకులు రాజేశ్వరి చౌదరి ఉన్నారు.

జియో మైసూర్ సేవలు మరువలేనివి

తుగ్గలి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జియో మైసూర్ కంపెనీ చేస్తున్న సేవలు మరువలేనివని టీడీపీ నాయకుడు కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం జొన్నగిరిలో మాట్లాడుతూ జొన్నగిరి హాస్టల్‌ను రూ.20లక్షలతో అభివృద్ధి చేసి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. కంపెనీకి భూములిచ్చిన రైతులకు ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. గ్రామాల్లో తాగు నీరు, పారిశుధ్య పనులు చేయించడంతో పాటు పేద విద్యార్థులకు సాయం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారని తెలిపారు.

ఘనంగా దేవర

తుగ్గలి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీ తండాలో దేవరను భక్తులు మంగళవారం నిర్వహించారు. మేళతాళాలతో, తప్పట్లతో భక్తులు భోనాలలో నైవేద్యం తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించి పూజ నిర్వహించారు. అలాగే గిరిజనుల ఇలవేల్పు సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదానం నిర్వహించారు. టీడీపీ నాయకులు వెంకటస్వామి, చంద్రశేఖరయాదవ్, జయరాం నాయక్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, వైసీపీ నాయకులు జిట్టా నాగేశ్, వెంకటేశ్ నాయక్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి చేరదీత


బాధితుడి(ఎడమ నుంచి మొదటివ్యక్తి)తో నీలకంఠ

ఆదోని టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని ఆర్పీఎఫ్ సిబ్బంది చేరదీశారు. వివరాల మేరకు.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన కపిల్ అనే వ్యక్తి మతిస్థిమితం లేకుండా తిరగుతున్నాడు. ఇది గమనించిన పోలీసులు గుజరాత్‌లోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వచ్చేవరకు బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ ఆధ్వర్యంలో దీపక్ డోకా, అంజయ్ కుమార్, శివరాజ్, శ్రీకాంత్ అతడిని స్థానిక జీవనజ్యోతి ఆశ్రమంలో చేర్పించారు. కుటుంబ సభ్యులు మంగళవారం రావడంతో కపిల్‌ను వారికి అప్పగించారు. ఆర్పీఎస్ ఎస్ఐ మల్లేశ్వరయ్య, బీజేపీ నాయకులకు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆర్డీటీ సేవలను కొనసాగించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 29 (ఆంధ్ర జ్యోతి): రాయలసీమ పేద ప్రజల వర ప్రదాయినిగా ఉన్న ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు) సేవలను కొనసాగించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఖాజా డిమాండ్ చేశారు. మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. విదేశీ నిధులు రాకుండా ఎఫ్‌సీఆర్ఏ (ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్)ను రెన్యూవల్ చేయ కుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పేదల అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. సంస్థ విద్యార్థులకు విద్య ప్రజలకు వైద్యం, గృహ నిర్మాణాలు, పర్యావరణం, పొదుపు సంఘాల అభివృద్ధి, క్రీడలు ఎన్నో సేవలను అందిస్తోం దన్నారు. పేదలు ఆర్డీటీ ద్వారా లబ్ధి పొంది ఉపాధితో అభివృద్ధి చెందారన్నారు. ఇప్పటి కైనా కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు వీడాలన్నారు. నాగరాజు, వీరేష్, రాగన్న, వలి, పాల్గొన్నారు.

సేవలను కొనసాగించాలి

దేవనకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సేవలు యధావిధిగా కొనసాగించాలని వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు నర్సారావ్ కోరారు. మంగళవారం మాట్లాడుతూ 1969లో విన్సెంట్ ఫెర్రర్ స్థాపించిన ఆర్డీటీ కరువు ప్రాంతప్రజలకు ఎన్నో సేవలు చేసిందన్నారు. తిమ్మప్ప, ఆశోక్, యూసుప్ బాషా, వెంకటేష్ ఉన్నారు.

చైర్మన్ కుర్చీ కోసం పోటాపోటీ


ఆదోని మున్సిపల్ కార్యాలయం

• ఎట్టకేలకు మైనార్టీలకే దక్కిన పదవి

ఆదోని టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్ వాల్మీకి శాంతపై అవిశ్వాస పెట్టి నెగ్గినప్పటి నుంచి చైర్మన్ పదివకోసం నాయకులు పోటీపడ్డారు. ముఖ్యంగా వైస్ చైర్మన్లు ఎం.డి. గౌస్, నరసింహులు మధ్యే పోటీ కనిపించింది. అయితే ఈ విషయంలో వైసీపీ శిబిరంలోనే సుదీర్ఘ చర్చ సాగింది. కౌన్సిలర్ల మె జార్టీ ప్రకారం ఎంపిక జరిగితే మహిళా కౌన్సిలర్ లోకేశ్వరికే అవకాశం ఇవ్వాలని పార్టీలో నిర్ణయించారు. అయితే ఇన్‌చార్జిని నియమించాలని ఆదేశాలు రావడతో గౌస్‌కు పదవి దక్కింది.

అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించినప్పటి నుంచి, నెగ్గే వరకు అన్ని తానై వ్యవహరించిన వైస్ చైర్మన్ నరసింహులు చివరి వరకు తనకే చైర్మన్ పదవి వస్తుందన్న ధీమాతో కనిపించారు. అయితే చివరకు అధినాయకత్వం గౌస్‌కే పట్టం కట్టింది.

చెత్తలక్ష్యం

• రోడ్డు పక్కనే చెత్తాచెదారం


బిల్లేకల్‌లో రహదారి పక్కనే చెత్త

ఆస్పరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లేకల్ గ్రామంలో చెత్తాచెదారం రోడ్డుపక్కనే పేరుకుపోయాయి. చెత్తను తొలగించాలని పలుమార్లు పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని యగ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించి పారిశుధ్య పనలు చేయించి, చెత్తను తరలించాలని కోరుతున్నారు.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

బాల్య వివాహాలు నేరం : ఎంపీడీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో పుల్లయ్య

నందవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహలు చట్టరీత్యా నేరమని ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. నందవరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహం చేస్తే కలిగే నష్టాలను వివరించారు. గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహలు నిర్వహిస్తే వెంటనే అధికారులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో సందీప్, డాక్టర్ శ్రీలేఖ, వెలుగు ఏపీయం రాఘవేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు



డిపో ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్,ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఉద్యోగులు రెండో రోజు కూడా రిలే నిరాహార దీక్ష చేశారు. ఎమ్మిగనూరు డిపో రీజనల్ సహాయ కార్యదర్శి అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో ముస్తాక్ అహ్మద్, మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా వేతనాలు, డబుల్ డ్యూటీ అమౌంట్ పెంచాలని కోరారు. మరో నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ ఉద్యోగులపై విధించే అక్రమ సస్పెన్షన్స్ ఎత్తివేయాలని, పారదర్శకమైన ట్రాన్స్‌ఫర్‌లు, నిలిచిపోయిన ప్రమోషన్‌లు ఇవ్వాలని కోరారు. మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణ సెలవులతో పాటు ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కర్నూలు రీజియన్ రీజనల్ సెక్రెటరీ మద్దిలేటి, ఎమ్మిగనూరు శిబిరానికి వచ్చి నిరాహర దీక్షలలో కూర్చున్న వారికి మద్దతు తెలిపారు .ఈ కార్యక్రమంలో షరిఫ్, సాహెబ్, బజారప్ప, భాస్కర్ పాల్గొన్నారు.


సుజల స్రవంతి యూనిట్ ప్రారంభం



సుజల స్రవంతిని ప్రారంభిస్తున్న క్లస్టర్ ఇన్‌చార్జ్ కాశీంవలి

నందవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నెలో మంగళవారం ఎన్టీఆర్ సుజల స్రవంతి యూనిట్-2ను క్లస్టర్ ఇన్‌చార్జ్ కాశీంవలి ప్రారంభించారు. దీంతో గ్రామానికి సురక్షితమైన తాగునీరు అందించామన్నారు. ఈ పథకం ద్వారా కేవలం 5 రూపాయలకే 20 లీటర్ల సురక్షితమైన మంచినీటిని అందించడంతో తాగునీటికి ఇబ్బంది లేదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈరన్న, జబ్బార్, చిన్నకొత్తిలి సత్యారెడ్డి, రామకృష్ణారెడ్డి, వహాబ్, మన్ని, నందవరం, వెంకట్‌రెడ్డి, నరసింహులు, సురేంద్ర పాల్గొన్నారు.

చెక్క రథంపై ప్రహ్లాదరాయలు



చెక్క రథంపై భక్తులకు దర్శనమిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై విహరించారు. వైశాఖ విదియ శుభ దినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెక్క రథంను వివిధ పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల మంటపంలో ఊంజలసేవలో స్వామివారిని ఊగించారు. పూర్ణబోధపూజ మందిరంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మూలరాములకు బంగారునాణేలతో అభిషేకం చేశారు.

మే డేను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న జిల్లా కార్యదర్శి

ఎమ్మిగనూరు టౌన్,ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కార్మికుల హక్కుల దినోత్సవం 139వ మే డేను జయప్రదం చేయాలని సిపిఐ(ఎంఎల్) ప్రతిఘటన (ఐఎఫ్‌టియు.పిఫైఎల్) జిల్లా కార్యదర్శి చిన్నిప్రసాద్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా స్థానిక మునిసపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఎనిమిది గంటల పని సమయం అమలు చేయడంలో విఫలమయిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలను మరియు ప్రైవేటీకరణను అపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తక్షణమే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరారు. అనంతరం పారిశుద్య కార్మికులతో కలసి మే డే కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పృథ్వీరాజ్, రాముడు, రవి, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన పల్లె సమస్యలు

- వీఆర్వోల కొరత
- ఐదారు గ్రామాలకు ఓ ఇన్‌చార్జి వీఆర్వో
- పరిష్కరానికి నోచుకోని భూసమస్యలు

గోనెగండ్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలాలలో భూసర్వేలు చేస్తున్నారు. అయినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. కేవలం ప్రకటనల వరకు మాత్రమే ఇన్ని గ్రామాలో సర్వేలు చేశామని అధికారులు చెప్పుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో రెవెన్యూ సమస్యలు పేరుకుపోతున్నాయి. రెవెన్యూ కార్యాలయాలలో సిబ్బంది కొరత కారణంగా సమస్యలను పరిష్కరించే నాథుడే కనిపించడం లేదు. మండలంలోని 12 గ్రామాలకు ఇన్‌చార్జి వీఆర్వోలే దిక్కు కావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. భూ సమస్యల పరిష్కారానికి నెలల తరబడి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ పనులు కావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం మాత్రం రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. అయితే అవి కంటి తుడుపు చర్యలుగానే మిగిలాయి. గ్రామాల్లో రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకుగాను జనాభా ప్రాతిపదికన వీఆర్వోలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గోనెగండ్ల మండలంలో 16 రెవెన్యూ గ్రామాలకుగాను 23 మంది వీఆర్వోలు ఉండాలి అయితే ప్రస్తుతం 11 మంది మాత్రమే ఉన్నారు. వీఆర్వోలు తక్కువగా ఉండటం వల్ల సమస్యలు తీరడం లేదని రైతులు అంటున్నారు. చాల గ్రామాల్లో ఇన్‌చార్జిల పాలనే కొనసాగుతోంది.

ఎక్కడి సమస్యలు అక్కడే:

గ్రామాల్లో వీఆర్వోల కొరత కారణంగా రైతుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా ఉన్నాయి. ప్రభుత్వం మాత్రం భూసర్వేలు చేస్తోంది. అలాగే చుక్కల భూముల సమస్యలు, పట్టాదారుపాసుపుస్తకాల సమస్యలు, విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో జాప్యం జరుగకూడదు ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించాలంటూ ప్రకటనలు చేస్తుంది అయితే అవి అచరణలో మాత్రం కనపడడం ముందుకు సాగడం లేదు. చాల గ్రామాల్లో వీఆర్వోలు లేక పనులు నిలిచిపోయిన సంఘటనలు ఉన్నాయి.

అంతా ఇన్‌చార్జిల పాలనే:

గోనెగండ్ల మండలంలోని చాల గ్రామాల్లో వీఆర్వో ఇన్‌చార్జిల పాలనే కొనసాగుతోంది. 28 గ్రామాలు(16 రెవెన్యూ గ్రామాలు)కు గాను 23 మంది వీఆర్వోలు ఉండాలి కాని కేవలం 11 మంది మాత్రమే ఉండటంతో వీఆర్వోలు రెగ్యూలర్ గ్రామాలకు, ఇన్‌చార్జి గ్రామాలకు న్యాయం చేయలేకపోతున్నారు. దీంతో రైతుల పనులు ముందుకు సాగడం లేదు. భూసర్వే సమస్యలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంలో జాప్యం జరుగతోంది. అలాగే ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శేఖర్ పదోన్నతిపై వెళ్లి దాదాపు మూడేళ్లు అవుతున్నప్పటికీ కొత్త సీనియర్ అసిస్టెంట్ ఇంకా రాలేదు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నారు. గ్రామీణ ముఖ్య పాలన అంతా ఇన్‌చార్జి పాలనగా సాగుతోంది. చుక్కల భూముల సమస్యలు తీరడం లేదు. నెలల పాటు చుక్కల భూముల సమస్యను పరిష్కరించుకునేందుకు కార్యాలయాల చుట్టు తిరగాల్సి వస్తుందని రైతులు అవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి వీఆర్వోల సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజలు

వీఆర్వోలను నియమించాలి:



ప్రభుత్వం గ్రామాల్లో రెగ్యులర్ వీఆర్వోలను నియమించాలి. వారి కొరత కారణంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఒక వీఆర్వో రెండు మూడు గ్రామాలలో పనులు చేయాలంటే ఇబ్బందిగా ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం స్పందించాలి.

-మురళీనాయుడు, గోనెగండ్ల

సిబ్బంది కొరత ఉంది



మండలంలో 12 గ్రామాలకు రెగ్యులర్ వీఆర్వోలు లేరు. ప్రస్తుతం ఉన్న వీఆర్వోలకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాము. మరోవైపు రీసర్వే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ కారణంగా పనులలో జాప్యం జరుగుతోంది. మండలంలో ఉన్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. వారు త్వరలో పరిష్కరిస్తారనే నమ్మకం ఉంది. ప్రస్తుతం ఇన్‌చార్జిలతోనే మండలంలో పాలన కొనసాగుతోంది. సమస్యలు త్వరలో పరిష్కారం అవుతాయి.

-కుమారస్వామి, తహసీల్దార్, గోనెగండ్ల

పంచాయతీ రికార్డుల తనిఖీ

మంత్రాలయం,ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) :మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి గ్రామ పంచాయతీలో చేపట్టిన పనులు రికార్డులను డీఎల్‌పీఓ నూర్జహాన్ తనిఖీ చేశారు. మంగళవారం గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిపై ఆర్‌టీ యాక్ట్‌పై వచ్చిన ఆరోపణలపై రికార్డులను పరిశీలించారు. 2019 నుంచి ఇప్పటి వరకు పంచాయతీలో జరిగిన అభివృద్ధి, దానికి సంబంధించిన రికార్డులు తదితర వివరాలు కావాలని కర్నూలు జిల్లా ఆర్టీ యాక్ట్ లీగల్ సెల్ అడ్వైజర్, అడ్వకేట్ విజయ్‌కుమార్ సమాచార హక్కు చట్టం కింద కోరారు. అయితే గ్రామ కార్యదర్శి సరైన సమాచారం ఇవ్వలేదని జిల్లా కలెక్టర్, డీపీఓ, ఆదోని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డివిజినల్ పంచాయతీ అధికారి నూర్జహాన్ విచారణ అధికారిగా ఆదేశించారు. దీంతో సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన సమాచారాన్ని పంచాయితీలో ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈ రికార్డుల పరిశీలనలో జరిగిన అవకతవకలపై డీపీఓకు నివేదిక సమర్పిస్తామని డీఎల్‌పీఓ నూర్జహాన్ తెలిపారు. ఈ పరిశీలనలో ఈఓఆర్‌డీ ప్రభావతీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు, గ్రామ కార్యయదర్శులు మహేష్, వేణుగోపాల్, సర్పంచు సుజాత, సాగునీటి సంఘం అధ్యక్షుడు వెంకటరాముడు, ఏపీ మోడల్‌స్కూల్ ఛైర్మెన్ వెంకటేష్, యాగంటి ఈరన్న, ఉసేని పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నూర్జహాన్

నేడు బసవ జయంతి

విద్యుత్ దీపాలతో సుందరంగా ఆలయ ముస్తాబు

ఎమ్మిగనూరు,ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వీరశైవుల ఆరాధ్యదైవం విశ్వగురు బసవేశ్వరుడు జయంతిని బువారం నిర్వహించేందుకు వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని షరాఫ్ బజార్‌లో వెలసిన ఎదురు బసవన్న గుడిలో నేడు స్వామివారికి అభిషేకంతో పాటు పలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే భక్తులకు అన్నధానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పట్టణంలోని ప్రధాన రహదారులలో బసవేశ్వరుని చిత్రటాన్ని ఊరేగించనున్నారు. అలాగే తేరుబజారు ప్రాంతలో వెలసిన బసవేశ్వర ఆలయంలో బసవజయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. బసవజయంతి సందర్భంగా బసవేశ్వర ఆలయాలను విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు.



విద్యుత్ దీపాలంకరణలో బసవేశ్వరాలయం

కుక్కల వీరంగం

● ఇబ్బందుల్లో మహిళలు, పిల్లలు



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

గోనెగండ్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలు వీరంగం చేస్తున్నాయి. గత ఆరు మాసాలుగా మండల వ్యాప్తంగా 500 మందిపై కుక్కలు దాడులు చేసి గాయపరచినట్లు ఆసుపత్రి లెక్కలు చెపుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో చిక్సిత పొందినవారి లెక్కలు ఇవీ మరి ప్రైవేట్‌గా చికిత్స చేయించుకున్నవారు మరో వెయ్యి మందికి పైగానే ఉంటారు. గుంపులు గుంపులుగా తిరుగుతూ వీధుల్లో తిరిగే జనంపై దాడులు చేస్తూ తీవ్ర గాయాలపాలు చేస్తున్నాయి. మండలంలోని గోనెగండ్ల, వేముగోడు, తిప్పనూరు, కున్నూరు, అలువాల, కులుమాల, హెచ్ కైరవాడి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో కుక్కలు అధిక సంఖ్యలో సంచరిస్తున్నాయి. పంచాయతీల సిబ్బంది తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది

అపరిచితులకు ఓటీపీ నెంబర్లు చెప్పరాదు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి

పెద్దకడుబూరు , ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే ఓటీపీ నెంబర్లు చెప్పరాదని ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు.

కొలతల్లో తేడా వస్తే కేసులు

కోసిగి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు వినియోగదారులకు సరైన కొలతలతో సరుకులను అమ్మకాలు జరపాలని, కొలతల్లో తేడాలు వస్తే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కోసిగి రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణాల్లో, వాల్మీకి సర్కిల్‌లోని చికెన్ షాపులలో వెయింగ్ మిషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లలో ఎలాంటి లోపాలు ఉండరాదని, కాటాలకు ప్రతి ఏడాది ముద్ర, రాళ్ల తక్కెడకు రెండేళ్లకు ముద్రవేయించుకోవాలన్నారు. ఈతనిఖీలలో సిబ్బంది లతీఫ్ బాషా, పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లు

కోసిగి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 28 నుంచి జూన్ ఆరో తేదీ వరకు సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి దుల్లయ్య తెలిపారు. మంగళవారం గ్రంథాలయం సమ్మర్ క్యాంప్ సందర్భంగా విద్యార్థులు కొత్త పుస్తకాలతో చదువుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

రేపు టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన

వర్చువల్‌గా పాల్గొననున్న సీఎం చంద్రబాబు నాయుడు



టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసే స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): చేనేతల కల సాకారం అవుతోంది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న టెక్స్‌టైల్ పార్కుకు మే1 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, చేనేత జౌళిశాఖ ఏడీహెచ్ నాగరాజరావు, ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులతో స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో సమావేశం నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్, అధికారులతో కలిసి మండలంలోని బనవాసిలో టెక్స్‌టైల్ పార్కుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ విద్యాశాఖమంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో చేనేతలకు ఇచ్చిన మాటప్రకారం బనవాసిలో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 77 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న మెగా టెక్స్‌టైల్ పార్కులో 20 ఎకరాలు చేనేత కళాకారుల కోసం కేటాయిస్తారని తెలిపారు. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు కోసం తమిళ నాడులో విజయవంతంగా నడుస్తున్న పలు టెక్స్‌టైల్ పరిశ్రమలను అధికారులతో కలిసి పరిశీలించామన్నారు. 2014-19లో తెలుగుదేశం ప్రభుత్వం ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసేందుకు 99 ఎకరాల స్థలాన్ని అప్పటి సీఎం చంద్రబాబు కేటాయించారన్నారు. అయితే తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేనేతలకు అన్యాయం చేస్తు టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటును పట్టించుకోలేదన్నారు తిరిగి చంద్రబాబు సీఎం అయ్యాక ఈ సమస్య పరిష్కారమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, తహసీల్దార్ శేషఫణి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టీడీపీ చేనేత నాయకులు బుగిడే నాగరాజు, మిన్నప్ప, బండా నరసప్ప, టీడీపీ నాయకులు కురువ మలయ్య, నావాజ్, దేవదాసు పాల్గొన్నారు.

మంత్రాలయం ఎంపీడీవోగా నూర్జహాన్



మంత్రాలయం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఎంపీడీవోగా బీ నూర్జహాన్ బాధ్యతలు తీసుకున్నారు. జూపాడు బంగ్లాలోని ఏవోగా పని చేస్తున్న ఆమె మంత్రాలయం ఎంపీడీవోగా పదోన్నతి పొందారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని 20 సచివాలయాల్లో ఉద్యోగులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉండాలని తెలిపారు. విధులకు డుమ్మా కొట్టే సిబ్బందిపై చర్యలు తీసుకుంటా మన్నారు. మే1న ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. పింఛన్ పంపిణీ చేసే రోజుల్లో సిబ్బందికి సెలవులు ఇవ్వమని తెలిపారు.

మద్యం కేసు నమోదు

గోనెగండ్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలో చిన్ననుంకన్న అనే వ్యక్తి మద్యం అమ్మకాలు జరుపుతుండటంతో అరెస్టు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. గ్రామానికి చెందిన చిన్న నుంకన్న కొంతకాలంగా అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం పోలీసులకు చేరడంతో మంగళవారం గ్రామంలో ఆయన ఇంట్లో సోదా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 16 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకొని ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేతనం రూ. 307 వచ్చేలా చూడాలి: ఎంపీడీవో

నందవరం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రతి కూలీకి రోజువారి వేతనం రూ.307 వచ్చేలా చూడాలని ఎంపీడీవో పుల్లయ్య ఫీల్డ్ అసిస్టెంట్, మేటీలకు సూచించారు. నందవరంలో ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న ఫీడర్ చానల్ పనులను పరిశీలించారు. కొలతల ప్రకారం పనిచేసి రోజు వేతనం రూ. 307 తీసుకునేలా చూడాలని కూలీలకు సూచించి మస్టర్లను తనిఖీ చేశారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన బీమా చేసుకోవాలని వారికి తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాఘవరాయడికి పంచామృతాభిషేకం

మంత్రాలయం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో గ్రామదేవత మంచాలమ్మ దేవతకు, రాఘవరాయడికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం వైశాఖ విదియ శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి, రాఘవరాయడి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను, రాఘవేద్రస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఎంపీడీవోలకు సన్మానం

మంత్రాలయం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం, పెద్దకడబూరు ఎంపీడీవోలుగా పదోన్నతి పొందిన బీ నూర్జహాన్, మంత్రాలయం ఈవోఆర్‌డీగా పనిచేసిన ప్రభావతీదేవి పెద్దకడబూరు ఎంపీడీవోగా, మంత్రాలయం ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన రాధలను గ్రామ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు వేణుగోపాల్, ఇస్రత్‌బాషా, స్వామినాథన్, మహేష్, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ముగ్గురికి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు రాముడు, రాజేష్, హరిప్రియ, మధుశ్రీ, గౌతమి, సునీత, రమేష్, నాగరాజుఆచార్ పాల్గొన్నారు.

టూ వీలర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాదిక్

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టూ వీలర్ బైక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాదిక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక అజంతా ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ ఉపేంద్రబాబు మాట్లాడుతూ అధ్యక్షుడు అంటే ఇంటికి పెద్ద దిక్కులాంటివారని అన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. కలసి కట్టుగా ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. అందరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని అన్నారు. పోలీసులకు సహకరించి సమాజానికి ఉపయోగపడాలన్నారు. బైక్‌లు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పని సరిగా ధరించాలన్నారు. ఉపాధ్యక్షుడిగా అహ్మద్, సెక్రెటరీగా నాగరాజు, లీగల్ అడ్వయిజర్‌గా రషీద్‌లను ఎన్నుకున్నారు.